14-10-25 Samayam_Layout 1 10/14/2025 2:39 AM Page 1

SAMAYAM

epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 13 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 14 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## యుద్ధ విరమణ వేళ ఇజ్రాయిల్‌లో
# ట్రంప్ పర్యటన

పార్లమెంటులో ప్రసంగం.. స్వాగతించిన ఎంపీలు
ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ అభినందనలు
అమెరికా అండ ఎల్లవేళలా ఉంటుందని హామీ

హమాస్‌తో యుద్ధ విరమణను స్వాగతిస్తూ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. థాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్పపని చేశావని ప్రధాని బెంజమిన్ నెతన్యాహును పొగిడారు. రెండేళ్లుగా తమ చెరలో ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు.

# శాంతి ఒప్పందంలో బందీల విడుదల

## స్వాగతించిన ప్రధాని మోడీ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా సజీవంగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయడాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



## రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం
ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలన ఆదేశం

.. వివరాలు 3లో



## మెడికోపై అత్యాచార ఘటన

మహిళా సీఎం ఇలాగే మాట్లాడుతారా
సీఎం మమత వ్యాఖ్యలపై మండిపాటు
ఒడిషా మహిళా కమిషన్ ఆగ్రహం

.. వివరాలు 3లో



## సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు
# రూ.60 కోట్లు

### భోజనం, జీతాలు, మౌలిక సదుపాయాల మరమ్మతులకు కేటాయింపు

- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేస్ రికగ్నేషన్
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో రేవంత్ రెడ్డి
- వైద్య సేవలు, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు

**హైదరాబాద్ అక్టోబర్ 13:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీ లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన , బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా... జవా బుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసు కునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని... దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు.

మిగతా 2 లో



## అద్భుతంగా మేడారం

- గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందే
- మంత్రి సీతక్కతో కలసి మేడారం పనులపై సమీక్ష
- 70 కోట్ల కాంట్రాక్ట్ కోసం కక్కుర్తి పడే మనిషిని కాదు
- మంత్రి పొంగులేటి వ్యాఖ్య

2

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
# నోటిఫికేషన్ విడుదల

21 వరకు నామినేషన్ల స్వీకరణ
22న నామినేషన్ల పరిశీలన
24న నామినేషన్ల ఉపసంహరణ గడువు




## తొలిరోజు పదిమంది నామినేషన్లు దాఖలు

మిగతా 2 లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు



ఓటర్లను భయపెడుతున్న అధికార కాంగ్రెస్
ఎన్నికల సంఘానికి కేటీఆర్ ఫిర్యాదు

03

## జూబ్లీహిల్స్‌లో 200 నామినేషన్లు వేస్తున్నాం

తెలంగాణ మాల సంఘాల జేఏసీ

02

## నకిలీ మద్యం సూత్రధారి
# జోగి రమేశ్






ఆయన కనుసన్నల్లోనే మద్యం తయారీ
తంబళ్లపల్లిలో మద్యంతో బాబుపై బురదజల్లే యత్నం
తనను ఆస్ట్రేలియాకు పంపి.. లీకులిచ్చిన జోగి
నిందితుడు జనార్ధన్ రావు సంచలన వీడియో విడుదల

**విజయవాడ :** నకిలీ మద్యం కేసులో నిందితుడు జనార్ధన్ రావు సంచలన విషయాలు బయటపెట్టాడు. జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీ జరిగిందని పేర్కొన్నాడు. కూటమి ప్రభుత్వం రాగానే నిఘా పెరగడంతో తయారీ ఆపేసినట్లు వివరించాడు.

మిగతా 5 లో



# నేడు ఢిల్లీలో ఏఐ హబ్ చారిత్రాత్మక ఒప్పందం

విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు రంగం సిద్ధం
సుమారు రూ.87,250 కోట్లతో భారీ పెట్టుబడి పెట్టనున్న టెక్ దిగ్గజం
సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ఒప్పందం

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక రంగాల భవిష్యత్తును మార్చే దిశగా ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. టెక్నాలజీ దిగ్గజం గూగుల్, విశాఖపట్నంలో సుమారు 10 బిలియన్

మిగతా 5 లో

## ప్రపంచంలోనే అద్భుత నగరిగా
# అమరావతి



భవిష్యత్ తరాలకు ఆదర్శంగా రాజధాని
రాజధాని రైతుల త్యాగాన్ని మరువలేం
వారు పడ్డ కాష్టాలన్నీ గుర్తున్నాయి
సమస్యలను పరిష్కరించే బాధ్యత మాదే
సీఆర్డీఏ కార్యాలయ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి :** ప్రపంచంలో అత్యద్భుత నరగంగా అమరావతి రాజధాని నిర్మాణం కాబోతున్నదని సిఎం చంద్రబాబు అన్నారు. దేవతల రాజధాని అమరావతి ఎలా ఉంటుందో కానీ, మన రాజధాని అమరావతి అంతకుమించి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదని, మనభవిష్యత్ ఆశలకు తార్కాణంగా ఉంటుందన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. భూములు

మిగతా 5 లో





# మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

## సీఎం రేవంత్, జర్నలిస్ట్ సంఘాల సంతాపం

**హైదరాబాద్, అక్టోబర్ 13:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (83) కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. సోమవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1982లో కాంగ్రెస్ తరఫున ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగానూ లక్ష్మారెడ్డి పనిచేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నగరంలోని మహా ప్రస్థానంలో మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన కాంగ్రెస్ లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీసీసీ ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్‌తో పాటు పలు కీలక బాధ్యతలను లక్ష్మారెడ్డి నిర్వర్తించారు. 1999, 2014లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఓటమి పాలయ్యారు.జర్నలిజం పట్ల మక్కువతో లక్ష్మారెడ్డి 1980లో స్థానిక వార్తా సంస్థ ఎన్ఎస్ఎస్ మొదలుపెట్టారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా ఆయన సేవలందించారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేసిన కొండా వెంకట రంగారెడ్డి మనవడు లక్ష్మారెడ్డి కావడం గమనార్హం. ఆయన మరణ వార్త తెలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రాజకీయ నేతలు సంతాపం ప్రకటించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మా రెడ్డి మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ వార్తా ఏజెన్సీ స్థాపకుడిగా, ఎమ్మెల్యేగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ గా ఆయన సేవలందించారని కొనియాడారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు సీఎం సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో లక్ష్మారెడ్డి పలు హోదాల్లో పని చేశారని డిప్యూటీ సీఎం భట్టి గుర్తు చేసుకున్నారు. ప్రధానంగా ఆ ధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గ్రీవెన్స్ సెల్ అధికార ప్రతినిధిగా సేవలు అందించారన్నారు. లక్ష్మారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీతో పాటు పాత్రికేయ రంగానికి తీరని లోటని భట్టి చెప్పారు. లక్ష్మారెడ్డి మృతిపట్ల ప్రెస్ అకడామ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అమర్, ఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ ఎడిటర్ రఘు అవ్వారు, జర్నలిస్ట్ సంఘాల నేతలు నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు సంతాపం ప్రకటించారు.

# లంచం తీసుకుంటే చూస్తూ ఊరుకోం

## సివిల్ తగాదాల్లో తలదూరిస్తే కఠిన చర్యలు

## రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ హెచ్చరిక




**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** పోలీసులు లంచగొండులుగా మారినా, సివిల్ తగాదాల్లో తలదూర్చిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరిచారు. పోలీస్ స్టేషన్‌లలో సివిల్ వివాదాలకు తావు లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సివిల్ వివాదాల కోసం సివిల్ కోర్టులు ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్ అడ్డాగా సివిల్ పంచాయితీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలని డీజీపీ ప్రస్తావించారు. యూనిఫాం, అవినీతి ఒకే దగ్గర ఉ ఒడవని తేల్చిచెప్పారు. ఒక్క పోలీస్ అధికారి అయినా లంచం తీసుకుంటే డిపార్ట్‌మెంట్ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పుకొచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రత పోలీసు ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. పోలీస్ సిబ్బంది వెల్ఫేర్ తన వ్యక్తిగత ప్రయారిటీ అని చెప్పు కొచ్చారు. ఫెయిర్ అండ్ ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ తన ఫిలాసఫీ అని నొక్కిచెప్పారు డీజీపీ శివధర్ రెడ్డి. కేసుల విషయంలో బేసిక్ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీని వాడాలని సూచించారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే పోలీసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆపదలో ఆదుకున్న వాళ్లని పేదలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో 200 నామినేషన్లు వేస్తున్నాం

## తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటన

**హైదరాబాద్, అక్టోబర్ 13:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం జిల్లాల వారీగా 200 మంది మాలలు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. రాష్ట్రంలో ఆరు నెలలుగా జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎస్సీల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొంది. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్, అధ్యక్షుడు చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 'ఎంపెరికల్ డేటా తీసుకుని, అన్ని వర్గాలతో చర్చించి వర్గీకరణ చేస్తామన్నారు. అవేవీ చేయకుండానే వర్గీకరణ చేసి 58 కులాల గొంతు కోశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం అని జేఏసీ నేతలు తెలిపారు.



# హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

మొదటి పేజీ తరువాయి

హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్ లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ఆదేశించారు. సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్ జ్యోతి , బి. షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



# అద్భుతంగా మేడారం అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

భక్తుల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు మంత్రి. 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాతి కట్టడాలకు కావల్సిన గ్రానైట్ పొరుగు రాష్ట్రాల నుండి తెప్పిస్తున్నట్లు చెప్పారు. శాశ్వత ప్రతిపాదకన పనులు చేస్తున్నామని అన్నారు. ఆదివాసీల ఆచార సంప్రదాయాలకు విఘాతం కలుగకుండా నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. గత జాతరకు కోటిమంది భక్తులు హాజరయ్యారని.. ఈసారి భక్తుల సంఖ్య డబుల్ అవుతుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇక ఇటీవల తనపై వచ్చిన విమర్శలపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. నేను ఏంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయపడే అవసరం లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నా మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏం ఉంది. సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారక్కలాగ పనిచేస్తున్నారని పొంగులేటి అన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.




తనపై మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేశారని అనుకోవటం లేదన్నారు. తనపై ఫిర్యాదు చేయటానికి ఏముంటుందని అన్నారు. రూ.70 కోట్ల కాంట్రాక్ట్ కోసం తాపత్ర ఓయ పడే అంత అవసరం తనకు లేదన్నారు. అయితే తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.

# నూనె గింజల సాగుకు సబ్సిడీ విత్తనాలు

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ■ నేడు సచివాలయంలో ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబర్13:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం రూ. 66.66 కోట్లతో నూనె గింజలు విస్తీర్ణం, ఉత్పాదకత పెంచి స్వయం సమృద్ధి సాధించే విధంగా నూనె గింజలు సాగు చేసే రైతులకు వివిధ రకాల ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ రూ. 27 లక్షలతో బ్రీడర్ విత్తనం రూ. 2.50 కోట్లతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీడ్ హబ్, సీడ్ స్టోరేజ్ యూనిట్స్ ను నెలకొల్పడం, రూ. 8.13 కోట్ల బ్లాక్‌డిమెట్రోనేషన్‌నిర్వహణ, రూ. 2.37 కోట్లలతో 24 నూనె తీసే యంత్రాల సరఫరా, రూ. 47.06 కోట్లతో నూనె గింజలలో నూతన వంగడాలను తెస్తున్నట్లు చెప్పారు. గత ఐదు సంవత్సరాల లోపు విడుదలైన అధిక దిగుబడి , చీడపీడల నుండి తట్టుకునే వంగడాలకు సంబంధించిన విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తామన్నారు. వేరుశనగ పండే 8 జిల్లాలలోను గుర్తించి అక్కడ రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ఎంపిక చేసిన రైతులకు దాదాపు రూ.46.14 కోట్లు వెచ్చించి 45350 ఎకరాలకు సరిపడా 38434 క్వింటాళ్ల విత్తనాలు మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ జిల్లాలలో జీజెజీ 32(19490) క్వింటాళ్లు, కదిరి లేపాక్షి(18212) గిర్నార్(732) క్వింటాళ్ల విత్తనాన్ని 100 శాతం సబ్సిడీపై సరఫరా చేయుటకు వ్యవసాయ శాఖ ద్వారా ఏర్పాట్లు చేసినట్లు మంత్రికి డైరెక్టర్‌గోపీ తెలిపారు. సాంప్రదాయంగా సాగు చేసే వంగడాలతో పోల్చుకుంటే కదిరి లేపాక్షి, జీజేసీ 32, గిర్నాల్ 5 రకాలు దిగుబడి 50 శాతం నుండి 60 శాతం మేరకు అదనంగా నమోదైనట్లు ఆయన చెప్పారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని మంత్రి చేతుల మీదుగా మీదుగా ఆరంభించుకోవడం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఆయా జిల్లాల్లో రైతు వేదికల వద్ద ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

# ఐపీఎస్ అధికారి పూరన్ కుటుంబానికి భట్టి పరామర్శ

## కుటుంబానికి అండగా ఉంటామని హామీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో భట్టి ఫోన్‌లో మాట్లాడించారు. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

## 21 వరకు నామినేషన్ల స్వీకరణ

## 22న నామినేషన్ల పరిశీలన

## 24న నామినేషన్ల ఉపసంహరణ గడువు

**హైదరాబాద్, అక్టోబర్ 13:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల పర్వం మొదలయ్యింది. నామినేషన్లను స్వీకరించడానికి చివరి తేదీ అక్టోబర్ 21 మంగళవారంగా నిర్ణయించింది. . అలాగే నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 22 బుధవారం నాడు జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీగా అక్టోబర్ 24 శుక్రవారంగా నిర్ణయించారు. పోలింగ్ నవంబర్ 11న నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరిపి అదేరోజు ఫలితం ప్రకటిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్లను ఫారం-2బిలో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి తప్పనిసరిగా ఫారం-26లో అఫిడవిట్‌ను సమర్పించాలి. అన్ని పత్రాలపై అభ్యర్థి సంతకం, నోటరీ సంతకం, నోటరీ సీల్‌తో నోటరైజ్ చేయాలి. అక్టోబర్ 19 ఆదివారం, అక్టోబర్ 20 దీపావళి తేదీల్లో పబ్లిక్ సెలవులు




కారణంగా నామినేషన్లను స్వీకరించబడవు. ఇక ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి కనీసం 25 సంవత్సరాలు నిండి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రపోజర్‌గా ఉండాలి. ఇతర అభ్యర్థులకు మాత్రం నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజర్లుగా ఉండాలి. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ విషయానికి వస్తే జనరల్ కేటగిరీకి రూ.10,000, ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ.5,000 నగదు చెల్లించాలి.

# తొలిరోజు పదిమంది నామినేషన్లు

**హైదరాబాద్, అక్టోబర్ 13:** జూబ్లీహిల్స్‌లో సోమవారం నామినేషన్లకు తొలిరోజు కావడంతో ఔత్సాహిక అభ్యర్థులు నామినేషన్లు వేశారు. తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ వేసిన వారిలో ఇద్దరు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఉండగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. తెలంగాణా పునర్నిర్మాణ సమితి తరఫున పూస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయగా.. నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

# అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

- ఏపని చేయాలన్నా పర్సెంటీజీలు వసూళ్లు
- కాంగ్రెస్ రాకతో అభివృద్ధి వెనక్కి
- ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ సురుకు తగలాలి
- పార్టీ కార్యకర్తల భేటీలో హరీష్ రావు



**హైదరాబాద్,అక్టోబర్13:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చేశారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. ఏ పని జరగాలన్నా కాంగ్రెస్ నేతలు కమిషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. రహమత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి. మా హయాంలో పేదల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఔషధాలు కూడా ఉండటం లేదు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారు.. పెద్దలవి కూల్చడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని.. 700 రోజులు దాటినా వాటిని అమలు చేయడం లేదని.. అందుకే అందుకే రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సురుకు తగలాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైన ఎన్నిక అని..యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడితే రేవంత్ రెడ్డికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. లేకుంటే ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టినా, హామీలు అమలు చేయకపోయినా, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినా నాకే ఓటు వేశారని రేవంత్ అంటాడని చెప్పారు. ఉద్యోగాలు రావాలన్నా.. పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా బీఆర్ఎస్ పార్టీ గెలవాలి, మాగంటి సునీతా గెలవాలన్నారు. రెండేళ్లలో రేవంతు రెడ్డి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిందని.. కేసీఆర్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, అత్యంత అవినీతి రాష్ట్రంగా తయారు చేసిందని మండిపడ్డారు. బిల్డింగ్ పర్మిషన్‌కు స్క్వేర్ ఫీట్‌కు రూ.75, ఫైనాన్స్ బిల్లు క్లియర్ కావాలంటే 12శాతం కమిషన్ ఇవ్వాలట అంటూ ఆరోపించారు. ఇళ్లు జాగ, భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే 40 శాతం భూములు రాసివ్వాలట.. మొత్తం పర్సెంటేజీలు డిసైడ్ చేసిందని ధ్వజమెత్తారు. ఒకప్పుడు తెలంగాణ అంటే పెట్టుబడులకు స్వర్గధామమని.. తెలంగాణ ఏ పథకం ప్రారంభిస్తే దేశం మొత్తం ఆ పథకం ప్రారంభించేదని.. తెలంగాణ అనుసరిస్తే, దేశం ఆచరించేదన్నారు. ఒక రాష్ట్రం ఎట్ల ఉండాలో కేసీఆర్ తయారు చేస్తే, రాష్ట్రం, సీఎం ఎట్ల ఉండగూడదో రేవంతు తయారు చేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని.. గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేశారని.. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారని.. ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభిస్తే రేవంత్ ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిందని.. ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదు, మందులు లేవన్నారు. వాళ్లకు జీతాలు ఇవ్వకుండా మీకు వైద్య సేవలు అందకుండా రేవంత్ రెడ్డి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. బస్తీ దవాఖానలు చూస్తే కేసీఆర్ గుర్తుకు వస్తారు, కాబట్టి బస్తీ దవాఖానల ఉనికి లేకుండా చేస్తున్నడని.. నీళ్ల బిల్లులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నపుడు 20వేల లీటర్ల వరకు బిల్లులు లేవని.. రేవంతు వచ్చిండు బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు మాగంటి సునీతమ్మ గెలుపు మాత్రమే కాదని.. తెలంగాణ ప్రజల గెలుపు అని తెలిపారు. ఉద్యమాలు, పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని.. భయపడాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ జూబ్లీహిల్స్ గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్‌ను దించి.. మనం కూడా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. తమ్ముడు విష్ణువర్ధన్ రెడ్డి సునితమ్మకు తమ్ముడిగా ఎంతో కృషి చేస్తున్నారని.. ఎక్కడ చూసినా కేసీఆర్ కు ఓటు వేస్తాం అని అంటున్నారని.. పెద్ద మెజారిటీతో సునీతమ్మను గెలిపించాలని హరీశ్‌రావు కోరారు.

# జూబ్లీహిల్‌లో కాంగ్రెస్ గుర్తుతో మజ్లిస్ పోటీ



- బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరును ప్రజలు గుర్తించారు
- బీజేపీకే గెలుపు అవకాశాల ఉన్నాయి
- నేడు అభ్యర్థిని ప్రకటిస్తామన్న రామచంద్రరావు

**హైదరాబాద్, అక్టోబర్ 13:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఇందుకు సంబంధించి ప్రధాన పార్టీలు వారి అభ్యర్థుల ఖరారుపై సన్నాహాలు మరింత దూకుడును పెంచాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. అనేక మంది విద్యావంతులు, మేధావులు బీజేపీలో చేరుతున్నారని.. మంగళవారం నాటికి జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు .అక్కడ కాంగ్రెస్ పోటీ చేస్తుందా, లేక మజ్లిస్ పోటీ చేస్తుందా అనేది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. ప్రస్తుతం మజ్లిస్ అభ్యర్థి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేస్తున్నాడు. హస్తం గుర్తుతోనే పతంగిని ఎగరేస్తున్నారు. ఇది జూబ్లీహిల్స్ ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. ఇకపోతే, జూబ్లీహిల్స్‌ను ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని.. అక్కడ ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేదన్నారు. ఇంకా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని.. అవన్నీ 420 కేసులే అన్నారు. బీజేపీనే గెలిపించాలని ప్రజలను కోరుతున్నామని ఆయన అన్నారు. నిజమైన ప్రతిపక్షంగా మేమే కాంగ్రెస్‌ను నిలదీస్తాం అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, బిఆర్ఎస్ పార్టీలో గెలిచినవాళ్లు ఆ పార్టీలో ఉంటారో లేదో తెలియదన్నారు. చివరికి వాళ్లు పార్టీ మారక తప్పదని.. పార్లమెంట్ ఎన్నికలలో మరో పార్టీ నుండి బి ఫార్మ్ తీసుకుని పోటీ చేసే పరిస్థితి వస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలుస్తుందనే నమ్మకం మాకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తోందా?మజ్లిస్ పోటీ చేస్తోందా? అని భాజపా ప్రశ్నించారు. కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మజ్లిస్ అధినేతను ఆయన కలిశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పాలనను జూబ్లీహిల్స్ ప్రజలు చూశారు. ఈ రెండు పార్టీలు నగరాన్ని అధ్వానంగా తయారు చేశాయి. విశ్వనగరం చేస్తామన్న భారత రాష్ట్ర సమితి.. విషాద నగరంగా మార్చింది. జూబ్లీహిల్స్ ప్రజలు భాజపాను ఆదరించాలి. నియోజకవర్గంలోని మేధావులు, సినీ ప్రముఖులు మా పార్టీకి ఓటు వేస్తారని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.

# న్యాయ వ్యవహారాల్లోనూ సాంకేతికత

- అందిపుచ్చుకుని ముందుకు సాగాలి
- లాఫెస్ట్ కార్యాక్రమం ప్రారంభించిన మంత్రి వివేక్



**హైదరాబాద్,అక్టోబర్13:** న్యాయరంగంలో సాంకేతికత విపరీతంగా పెరిగిందని.. ఇప్పుడు టెక్నాలజీ వాడి న్యాయపరమైన పత్రాలు రాయొచ్చు, అనాలిసిస్ చేయొచ్చని మంత్రి వివేక్ అన్నారు. టెక్నాలజీ తో పాటు హ్యూమానిటీ ఉండాలని.. ఎందుకంటే హ్యూమానిటీ లేకపోతే దీర్ఘకాలం ఏ రంగంలో నిలబడలేమని అన్నారు. బాగ్ లింగంపల్లిలోని అంబేద్కర్ లా కాలేజీలో విద్వత 2025 లా ఫెస్ట్ కి ముఖ్య అతిధిగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. అక్టోబర్ 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న లా ఫెస్టివల్‌ను మంత్రి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 1990లలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు 2020లలో పూర్తిగా మారిపోయాయని... న్యాయరంగంలో కూడా న్యాయమూర్తుల దృక్పథం, న్యాయవాదుల వైఖరి మారుతోందని అన్నారు. మనం కూడా వాటికి అనుగుణంగా మారాలని అన్నారు. నేను స్వయంగా ఒక ఇండస్ట్రియలిస్ట్ ని.. 5 లక్షల పెట్టుబడితో ప్రారంభించి, 2 వేల కోట్ల వ్యాపారం వరకు తీసుకువచ్చానని అన్నారు. ఇది సాధ్యమైంది కేవలం కష్టపడి, నిజాయితీగా పనిచేయడం వల్లే అని అన్నారు మంత్రి వివేక్. నేను మెడిసిన్ డాక్టర్, ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు.. అయినా కానీ కామన్ సెన్స్, కష్టపడి పనిచేయాలనే ఆసక్తి వల్లే సాధించ గలిగానని అన్నారు.. ఏ రంగంలోనైనా విజయం కావాలంటే కష్టపడాలని, నిజాయితీగా ఉండాలని, మనుషుల సమస్యలు అర్థం చేసుకోవాలని అన్నారు. అంబేద్కర్ కళాశాల ఈ సారి దేశవ్యాప్తంగా విద్యార్థులను ఆహ్వానిస్తూ ఇలాంటి ఉత్సవం నిర్వహించడం గొప్ప విషయమని... కాకా కేవలం 10వ తరగతి చదివినవారు అయినా, పేదలకు విద్య అందించాలి, అవకాశాలు కల్పించాలి అన్న దృక్పథంతో ఉన్నారని అన్నారు. ఆ దృష్టిని ముందుకు తీసుకెళ్లడం మన బాధ్యత అని అన్నారు మంత్రి వివేక్. ఈ కళాశాల 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం ఒక గొప్ప ఆలోచన అని... ఇది పోటీని, కృషిని పెంచుతుందని అన్నారు మంత్రి వివేక్. మా కుటుంబం కార్మిక ఉద్యమం నేపథ్యంతో ఉందని... నేను కార్మిక శాఖ మంత్రిగా కొత్త చట్టాలపై పనిచేశానని... ముఖ్యంగా గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన రక్షణ ఉండేలా ఒక చట్టం రాబోతోందని అన్నారు. అలాగే పదేళ్లుగా పెరగని కనీస వేతనాల వ్యవస్థను సరిచేయడం కూడా జరుగుతోందని అన్నారు.

# చిరుత దాడిలో చిన్నారి మృతి

## వలవేసి చిరును పట్టేసిన అధికారులు

**పుణె,అక్టోబర్13 :** పొలంలో పని చేస్తున్న తాతకు తాగునీరు తీసుకెళ్తున్న ఐదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసింది. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పింపార్ఖేడ్ గ్రామంలో ఆదివారం తమ ఇంటి సమీపంలోని పొలంలో పని చేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్య శైలేష్ బొంబే అనే ఐదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కిఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. దీన్ని గమనించిన అక్కడే పనిచేస్తున్న కొందరు వ్యక్తులు కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించినా చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించడానికి కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని.. 10 బోన్లు ఏర్పాటుచేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. స్థానికులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు.




# బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్ర

## కొత్త విద్యుత్ విధానంపై బీవీ రాఘవులు

**హైదరాబాద్, అక్టోబర్ 13:** విద్యుత్ పంపిణీ సంస్థల ప్రమేయం లేకుండా కేంద్రం చట్టం చేయబోతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు చెప్పారు. బొగ్గు గనులను కార్పొరేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు, విద్యుత్ ఉత్పత్తి సంస్థల లాభాల కోసం కేంద్రం ఇలా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై బీవీ రాఘవులు విమర్శలు గుప్పించారు. విద్యుత్ చట్ట సవరణ ప్రతిపానను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న చేసిందని తెలిపారు. దీనిపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని పేర్కొన్నారు. గతం కంటే దుర్మార్గమైన అంశాలు ఇందులో ఉన్నాయని ఆరోపించారు. వినియోగదారుల, కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన ఈ విధానం ద్వారా అదానీ కంపెనీలకు అధిక లాభం కలగనుందని బీవీ రాఘవులు ఆరోపించారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దీని ద్వారా రైతాంగానికి, ఉచిత గృహ విద్యుత్ పొందుతున్న వారందరికీ తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం.. అదానీ కంపెనీలకు మేలు చేసేందుకు చేసిందే అని విమర్శించారు. జూలై 25న సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారని గుర్తుచేశారు. మూడవ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేస్తామని అన్నారని చెప్పారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు

## ఓటర్లను భయపెడుతున్న అధికార కాంగ్రెస్

## ఎన్నికల సంఘానికి కేటీఆర్ ఫిర్యాదు



**హైదరాబాద్, అక్టోబర్ 13:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారని, ఓటర్లను భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు కాంగ్రెస్ పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి సోమవారం బీఆర్కే భవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాలని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నేతలు పెద్ద కుట్రకు తెరలేపారని ఆక్షేపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ అవుతోందని అంటుంటే, జూబ్లీహిల్స్‌లో మాత్రం కాంగ్రెస్ నేతలే ఓటు చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లని సృష్టించారని ఫైర్ అయ్యారు. ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పిర్యాదు చేశానని తెలిపారు. కొవ్వూరి కార్తీక్ పేరుతో మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని.. దీపక్ శర్మ అనే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. కింది స్థాయి అధికారులు కాంగ్రెస్‌తో కుమ్మక్కై దొంగ ఓట్లను సృష్టించారని మండిపడ్డారు. దొంగ ఓట్ల పైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కైన కింది స్థాయి అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలోపు 20 వేల దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక జరగాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

# కొత్త మద్యం పాలసీపై పిటిషన్

## విచారణ 2వారాలకు వాయిదా

**హైదరాబాద్,అక్టోబర్13 :** తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# బెంగాల్ తరహాలో జార్ఖండ్‌లో ఘటన

## రాంచిలో 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్

**రాంచి,అక్టోబర్13:** అమ్మాయిలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. బెంగాల్ మెడికోపై అత్యాచార ఘటన మరవక ముందే జార్ఖండ్‌లో ఓ ఘటన కలచివేసింది. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కామాంధుల్లో మార్పు రావడం లేదు. పశ్చిమ బెంగాల్ లో ఓ వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది. ఈ ఘటన మరువక ముందే తాజాగా జార్ఖండ్ లో అదే తరహా ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్ రాజధాని రాంచీలోని రతు ప్రాంతంలో 14 ఏళ్ల బాలిక తన కుటుంబంతో నివాసం ఉంటుంది. అయితే ఆదివారం ఆ బాలికపై కామాంధులు కాటేశారు. రాత్రి సమయంలో 9 మంది వ్యక్తులు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించామని పోలీస్ సూపరింటెండెంట్ ప్రవీణ్ పుష్కర్ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. అలానే నిందితులపై పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని రతు పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అధికారి రాం నారాయణ్ సింగ్ తెలిపారు.

## సంపాదకీయం



# ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు?

ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులు గా ట్రీట్ చేస్తున్నారు. ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధృ, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయసం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.

# యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

- పార్లమెంటులో ప్రసంగం.. ఎంపిల స్వాగతం
- ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ అభినందనలు
- అమెరికా అండ ఉంటుందని హామీ



**టెల్అవీవ్,అక్టోబర్13(ఆర్ఎన్ఎ):** హమాస్‌తో యుద్ధ విరమణను స్వాగతిస్తూ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. థాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్పపని చేశావని ప్రధాని బెంజమిన్ నెతన్యాహును పొగిడారు. రెండేళ్లుగా తమ చెరలో ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఉదయిస్తోంది. ఈ పవిత్ర భూమిలో శాంతి వీచికలు వీస్తుండగా ఆకాశం నిర్మలంగా మారింది. తుపాకులు మూగబోయాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైంది. బందీలు తిరిగివచ్చారు. ఈ మాట చెప్పడం ఎంతో బాగుంది. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి మేం సమయాన్ని వృథా చేస్తున్నామని చాలామంది అన్నారు. కానీ మేం సాధించాం అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో యూదులపై నాజీలు సాగించిన నరమేధం హోలోకాస్ట్ తర్వాత యూదులపై జరిగిన అత్యంత దారుణంగా అక్టోబర్ 7 దాడులను అభివర్ణించారు. అమెరికా ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బాధిత కుటుంబాలను ఉద్దేశించి పేర్కొన్నారు. అలాగే మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు, సలహాదారుడు జేర్డ్ కుష్నర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో వీరు కీలకపాత్ర పోషించారు. అయితే ట్రంప్ మాట్లాడుతోన్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. మారణహోమం అంటూ నినాదాలు చేశారు. దాంతో వారిని చట్టసభ నుంచి బయటకు పంపివేశారు. ఈ నిరసనలపై ట్రంప్‌నకు స్పీకర్ క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారమంతా గమనించిన ట్రంప్.. సమర్థవంతంగా పనిచేశారని చమత్కరించారు. దాంతో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. కాల్పులు ఒప్పందం చేసినందుకు గానూ.. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఎప్పుడూ తోడుగా ఉంటుందని హామీనిచ్చారు. ఈ సమయంలో ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో కాస్త గందరగోళం నెలకొంది. ట్రంప్ మాట్లాడుతున్న సమయంలో పాలస్తీనా–ఇజ్రాయెల్ జాయింట్ పొలిటికల్ పార్టీకి చెందిన ఎంపీ ప్లకార్డు ప్రదర్శించారు. 'పాలస్తీనాను గుర్తించాలి' అంటూ నినాదాలు చేశారు.

# రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

- పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం
- ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని ఆదేశం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** రాహుల్ చేసిన ఓట్ చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు భాజపా నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు. తాజాగా దీనిపై పిల్ వేయగా సుప్రీం తిరస్కరించింది. ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్థవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్–రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు.

# మెడికోపై అత్యాచార ఘటన

## మహిళా సీఎం ఇలాగే మాట్లాడుతారా
## సీఎం మమత వ్యాఖ్యలపై మండిపాటు
## ఒడిషా మహిళా కమిషన్ ఆగ్రహం




**భువనేశ్వర్, అక్టోబర్ 13:** ఒడిషా వైద్యవిద్యార్థినిపై బెంగాల్లో అత్యాచార ఘటనపై సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై మహిళలు, మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఒడిశాకు చెందిన వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఆ బాధ ఆమెకు ఏం అర్థమవుతోందని ఒడిశాకు చెందిన మహిళా నేతలు మండిపడ్డారు.మహిళల భద్రతకు భరోసా ఇవ్వకుండా.. రాత్రి బయటకు వెళ్లొదంటూ మమత చేసిన వ్యాఖ్యలు సరికాదని ఒడిశా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శోవ్నా మోహంతీ విమర్శించారు. దీదీగా పేరుపొందిన ఒక మహిళా నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం షాక్‌కు గురిచేసిందన్నారు. బెంగాల్ లోని మహిళలకు ఇది అవమానం అని ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిదా తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకుండా.. లింగ ఆధారిత అసమానత్వాన్ని తీసుకువస్తూ, బాలికల హక్కులు ప్రశ్నించడం ఏమాత్రం సరికాదన్నారు. ఆ విద్యార్థినిపై ఎలాంటి కనికరం లేకపోతే.. ఆ విషయాన్ని ఒడిశా ప్రభుత్వానికి రాతపూర్వకంగా తెలియ జేయండని అసహనం వ్యక్తంచేశారు. బాధితురాలు ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదువుతోంది. అర్ధరాత్రి 12.30కి అమ్మాయి బయటకు ఎలా వచ్చింది? నాకు తెలిసినంతవరకు ఈ ఘటన అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆ సమయంలో ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే ఘటన. ఇటువంటి వాటిని తమ ప్రభుత్వం సహించదు. దోషులను కఠినంగా శిక్షిస్తాం అని మమత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె బయటకు వెళ్లింది రాత్రి ఎనిమిది గంటలకు అని భాజపా నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఒడిశా లోని బాలేశ్వర్ జిల్లాకు చెందిన యువతి(23) పశ్చిమబెంగాల్ దుర్గాపుర్‌లోని ఓ ప్రైవేటు వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె ఫ్రెండ్‌తో కలిసి బయటకు వెళ్లగా, పలువురు దుండగులు వారిని వెంబడించారు. ఆ ఫ్రెండ్‌ను తరిమేసి.. ఆ విద్యార్థినిని సమీప అడవిలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో తాజాగా నాలుగో నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. దీనిపై బెంగాల్లోనూ నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. గతంలోనూ ఓ మెడికోపై అత్ఆచారం చేసి హతమార్చారు.




# సీబీఐ విచారణకు కరూర్ ఘటన

## జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ఇటీవల కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ ఘటనపై సుప్రీం కోర్టు సిబిఐ విచారణకు ఆదేశించింది. ఈ ఘటనలో కనీసం 41మంది దుర్మరణం చెందారు. తమిళనాట ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు నిరాకరించడంతో పిటిషనర్లు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తుపై పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపింది. కరూర్ తొక్కిసలాట నేపథ్యంలో పౌరుల ప్రాథమిక హక్కులపై జస్టిస్ జె.కె.మహేశ్వరి, ఎన్.వి.అంజరియాలతో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. దీనిపై అన్ని పార్టీలు వ్యక్తంచేస్తున్న అనుమానాలు తొలగాలంటే సమగ్ర దర్యాప్తు అవసరమని.. అందువల్లే ఈ కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రతినెలా కేసు పురోగతిని కోర్టుకు సమర్పించాలని సీబీఐని ఆదేశించింది.

# బందీలను విడిచి పెట్టిన హమాస్

## తొలివిడతలో ఏడుగురిని రెడ్‌క్రాస్‌కు అప్పగింత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** గాజా శాంతి ఒప్పందం ప్రక్రియ మొదలయ్యింది. బందీల విడుదలను ప్రారంభించాయి. ఈ క్రమంలో దాదాపు రెండేళ్లుగా హమాస్ చెరలో బందీలుగా ఉన్న వారికి సోమవారం విముక్తి లభించింది. తొలి దశలో భాగంగా ఏడుగురు బందీలను రెడ్‌క్రాస్‌కు హమాస్ అప్పగించింది. ఖాన్ యూనిస్ నుంచి వారిని తీసుకుని రెడ్‌క్రాస్ వాహనశ్రేణి ఇజ్రాయెల్‌కు బయల్దేరింది. బందీలు విడుదల వడంతో వారి కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. మిగతా బందీలను కూడా హమాస్ విడిచిపెట్టనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్ ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నుంచే ఈ ఒప్పందం అమల్లోకి రాగా.. బందీల విడుదల నేడు ప్రారంభమైంది. ఒప్పందం కింద తమ వద్ద ఉన్న 48 మంది బందీలను హమాస్ విడిచిపెట్టనుంది. అయితే, ఇందులో 20 మందే సజీవంగా ఉన్నారు. వీరిని గాజాలోని మూడు ప్రాంతాల్లో హమాస్ విడుదల చేయనుంది. ఇందుకు ప్రతిగా 2వేల మందికి పైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ విడుదల కార్యక్రమం ముగిసిన తర్వాత ట్రంప్ శాంతి ప్రణాళికలో రెండో దశపై చర్చలు ప్రారంభమవుతాయి. ఇందులో హమాస్ ఆయుధాలను త్యజించడం.. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ ప్రధాన అంశాలు. ఈ చర్చలకు అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు.

14-10-25 Samayam_Layout 1 10/14/2025 2:39 AM Page 5



# ప్రపంచంలోనే అద్భుత నగరిగా అమరావతి

మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన రైతుల అవస్థలు చూశానని.. రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు వస్తాయి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని

కూడా లేని పరిస్థితిలో విభజన జరిగింది. రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం. అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనే. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5 వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఇక్కడి రైతులు కూడా బాగుపడతారని హామీ ఇస్తున్నానని అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని



కూడా చెప్పకుండా విభజన చేశారని.. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని విమర్శించారు. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. బెస్ట్ రాజధాని నిర్మిస్తున్నామని... గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారని అన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని.. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు తనకు దారి చూపారని సీఎం వెల్లడించారు. రైతులు ఐదు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని.. రాజధాని వేశ్యల ప్రాంతమని మాట్లాడారని.. ఎడారి, స్మశానం అన్నారని మండిపడ్డారు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదన్నారు. 30, 40 లక్షల ఎకరాలు సాగు చేసే నది కృష్ణా నది ఇక్కడ పారుతోందని, ప్రపంచంలో ఎక్కడా లేని సిటీ అమరావతి అని తెలిపారు. ఇక్కడ గ్రీనరీ అద్భుతంగా వస్తుందని.. ఇక్కడ బ్లూ , గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పుకు మీరు, నేను, రాష్ట్ర ప్రజలు ఎంత అనుభవించారో చూశారు. ఇకపై ఎన్‌డీఏ ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. అమరావతి కన్నా విశాఖ ముందుకు వెళుతోంది. అమరావతికి శంకుస్థాపన సమయంలో పవిత్ర ప్రాంతాల నుంచి మట్టి నీరు తెచ్చారు. పార్లమెంట్ మట్టి, యమునా నది నీటిని ప్రధాని తెచ్చారు. అందుకే అమరావతి నిలిచింది. రైతులను నేను మరిచిపోను.. మరిచిపోతే త్యాగాన్ని మరిచిపోయినట్టే' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంతో ఆదాయం సృష్టిస్తుందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు తెలంగాణకు 70శాతం ఆదాయాన్ని సమకూరుస్తోందని అన్నారు. కార్య క్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశాఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

### ఏపీ పర్యటనకు ప్రత్యేకంగా ఆహ్వానం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. 45 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. వివిధ అంశాలపై చర్చించారు. సీఎం వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. కర్నూలులో ఈ నెల 16న 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమానికి, విశాఖలో జరిగే సీఐఐ సదస్సుకు ప్రధానిని చంద్రబాబు ఆహ్వానించారు. ప్రజాసేవలో 25 ఏళ్లు గడిచిన సందర్భంగా ప్రధానికి అభినందనలు తెలిపారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ తరఫున ప్రధానికి కృతజ్ఞతలు చెప్పినట్లు భేటీ అనంతరం చంద్రబాబు చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇదిలావుంటే 16న సిఎం శ్రీశైలం పర్యటన ఖరారు అయ్యింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

# నకిలీ మద్యం సూత్రధారి జోగి రమేశ్

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు సహకరించాలని కోరారు. నకిలీ మద్యం తయారీ మొదట ఇబ్రహీంపట్నంలో పెట్టాలనుకున్నాం. జోగి రమేశ్ ఆదేశాలతో తంబళ్లపల్లిలో తయారీ ప్రారంభించాం. తంబళ్లపల్లి అయితే చంద్రబాబుపై బురద జల్లొచ్చని జోగిరమేశ్ చెప్పారని జనార్దన్ రావు తెలిపాడు.ఏపీ నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అద్దేపల్లి జనార్దన్ రావు సంచలన విషయాలు బయటపెట్టారు . వైసీపీ పాలనలో జోగి రమేష్ ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారీ చేసినట్టు ఆయన చెప్పారు. అయితే, ఏపీలో ప్రభుత్వం మారగానే నకిలీ మద్యం తయారీ నిలిపివేశామని జనార్దన్ రావు చెప్పుకొచ్చారు. నకిలీ మద్యం తయారీ వెనుక జరిగిన అన్ని విషయాల్నీ జనార్దన్‌రావు ఒక వీడియో రూపంలో వెల్లడించారు. ఇప్పుడు ఈ వీడియో రాజకీయ వర్గాలను కుదిపేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జోగి రమేష్ మళ్ళీ నకిలీ మద్యం తయారు చేయమన్నారని జనార్దన్ రావు వెల్లడించారు. 'కూటమి ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టించే కుట్రతో.. మళ్ళీ నకిలీ మద్యం తయారీ మొదలు పెట్టాలని జోగి రమేష్ నాతో చెప్పారు. ఇబ్రహీంపట్నంలో పెట్టాలి అనుకున్నా కానీ, జోగి రమేష్ ఆదేశాలతో.. తంబళ్లపల్లె నియోజకవర్గంలో నకిలీ మద్యం తయారీ మొదలుపెట్టాం. తంబళ్లపల్లె నుంచి ప్రారంభిస్తే ప్రభుత్వంపై బురద జల్లొచ్చని జోగి రమేష్ అన్నారు. రూమ్ అద్దెకు తీసుకొని లిక్కర్ తయారీకి అన్ని యంత్రాలు తీసుకొచ్చాం. ఆర్థిక ఇబ్బందులు నుంచి బయట పడేస్తానని జోగి రమేష్ నాకు హామీ ఇచ్చారు. అంతా రెడీ అయ్యాక నన్ను ఆఫ్రికాలో ఉన్న ఫ్రెండ్ దగ్గరకు పంపారు. జోగి రమేష్ తన మనుషుల ద్వారా లీక్ ఇచ్చి రైడ్ చేయించారు. తద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్ర చేశాడు.' అని జనార్ధన్ రావు సంచలన విషయాలు బయటపెట్టారు. అంతేకాదు, 'టీడీపీ నుంచి సస్పెండ్ చేయడంతో జోగి రమేష్ మరో ప్లాన్





వేశారు. ఇబ్రహీంపట్నంలో కూడా రైడ్ చేయిద్దాం సరుకు తీసుకొచ్చి పెట్టు అని అన్నారు. జోగి రమేష్ చెప్పినట్టే లీక్ ఇచ్చి రైడ్ చేయించారు, సాక్షి మీడియా కూడా ముందే ఉంది. అనుకున్నది జరిగింది.. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చింది. నువ్వు ఇక్కడకు రావాల్సిన అవసరం లేదని జోగి రమేష్ అన్నారు. అంతా చూసుకుంటా బెయిల్ ఇప్పిస్తానని చెప్పి జోగి రమేష్ హ్యాండ్ ఇచ్చాడు. నా తమ్ముడిని కూడా నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ ఇరికించాడు. జై చంద్రారెడ్డికి నకిలీ మద్యంతో అసలు సంబంధం లేదని జనార్దన్ రావు చెప్పారు.

## ఆరోపణలను ఖండించిన మాజీ మంత్రి జోగి రమేశ్

ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జనార్దన్ రావు విడుదల చేసిన ఓ వీడియో ఇప్పుడు సంచలనంగా మారింది. మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ఆదేశాల మేరకే తాను నకిలీ మద్యం తయారు చేశానని అతడు ఆ వీడియోలో వాంగ్మూలం ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఆరోపణలపై మాజీ మంత్రి జోగి రమేశ్ తీవ్రంగా స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవమని కొట్టిపారేశారు. చంద్రబాబు ప్రభుత్వం తన చేతిలో ఉన్న సిట్‌తో విచారణ జరిపిస్తూ, కావాలనే ఈ కేసులో తనను ఇరికించాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఆయన సవాల్ విసిరారు. ఎవరో ఒకరిని ఇరికించడానికే ఈ కుట్ర జరుగుతోందని, నకిలీ మద్యం తయారీకి ఆంధ్రప్రదేశ్ ఒక కుటీర పరిశ్రమగా మారిపోయిందని ఆయన విమర్శించారు. చంద్రబాబు తన కుటుంబాన్ని తీసుకుని తిరుమల రావాలని, తాను కూడా వచ్చి ప్రమాణం చేస్తానని అన్నారు. లేకపోతే, విజయవాడ కనకదుర్గ గుడికైనా రావాలని జోగి రమేశ్ పేర్కొన్నారు. తాను, జనార్దనరావు తాత ఒకే వీధిలో ఉంటామని, జనార్దనరావు పిల్లలను బెదిరించి అతడితో తనపై ఆరోపణలు చేయించారని మండిపడ్డారు.

# పోలీస్ శాఖను మూసేయడం మంచిది

### ఆదేశాలు ఇచ్చినా అమలు చేయకపోతే ఎలా

### పరకామణి విచారణ సందర్భంగా హైకోర్టు ఆగ్రహం




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖను మూసివేయడం మేలని ఏపీ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో డీజీపీ, పోలీసు శాఖ నిద్రపోతోందని.. పోలీసు వ్యవస్థ పనిచేసేది ఇలాగేనా అని ప్రశ్నించింది. తిరుపతి పరకామణి కేసు విచారణ సందర్భంగా పోలీసు శాఖ పనితీరుపై హైకోర్టు ఆగ్రహించిందది. రికార్డులు సీజ్ చేయమని సెప్టెంబర్ 19వ తేదీన ఉత్తర్వులు ఇచ్చినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించింది. సీఐడీలో ఐజీ పోస్టు లేదనే కారణంతో ఆదేశాలు అమలు చేయరా..? అని నిలదీసింది. నిబద్ధత ఉంటే ఐజీ స్థాయి అధికారిని నియమించి రికార్డులు సీజ్ చేయమని డీజీపీ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చేవారని స్పష్టం చేసింది. ఈ కేసు దర్యాప్తులో కీలకమైన రికార్డులను సీజ్ చేయడంలో డీజీపీ విఫలం అయ్యారన్ని ÷ర్ అయింది ఏపీ హై కోర్టు. ఆధారాలను తారుమారు చేసేందుకు వీలుగా తప్పు చేసిన వారికి పోలీసులు సహకరించారని ఆరోపించింది. పోలీసు శాఖ చర్యలే ఈ కేసులో ఎంత నిజాయితీగా వ్యవహరించాయో చెబుతున్నాయని ఎద్దేవా చేసింది. రికార్డులు సీజ్ చేసి హైకోర్టు ముందు ఉంచాలని సీఐడీ డీజీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణ అక్టోబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. పరకామణిలో అక్రమాలపై ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది ఏపీ హైకోర్టు.

# లిక్కర్ మాఫియా డాన్ జగన్

### మాఫియాను అరికట్టే యత్నంలో ప్రభుత్వం

### మంత్రి నిమ్మల రామానాయుడు



**కర్నూలు :** ఏపీలో లిక్కర్ మాఫియాను పెంచి పోషించింది జగనే అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాఫియాను అరికట్టే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు సీఎం చంద్రబాబు కఠిన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కర్నూలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సక్సెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ పర్యటన కోసం రాయలసీమ ప్రజలు ఎదురు చూస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జీఎస్టీలో మార్పులు చేయడం వల్ల పేద మధ్య తరగతి కుటుంబానికి ఏడాదికి 20 నుంచి 40 వేలు ఆదా అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం మీద దాదాపుగా 8 వేల కోట్ల రూపాయల వరకు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. దేశ చరిత్రలో ఎప్పుడు ధరలు పెరగడం చూశాం. జీఎస్టీ సంస్కరణ వల్ల ధరలు తగ్గడం కూటమి ప్రభుత్వంలోనే చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీలో మార్పుల వల్ల మందులు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు భారీగా తగ్గాయని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమకు హంద్రీనీవా ప్రాజెక్టు గుండెకాయ అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అతి తక్కువ సమయంలో హంద్రీనీవా ప్రాజెక్ట్ కాలువను విస్తరణ పనులు చేపట్టి, చివరి ఆయకట్టుకు నీరు అందించిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి నిమ్మల కొనియాడారు. వైసీపీ అబద్దాలను నమ్ముకొని మనుగడ సాగిస్తోందని ఆరోపించారు. నాసిరకం మద్యానికి ఆద్యుడు మాజీ సీఎం జగనే అని విమర్శించారు. మొలకలచెరువులో నకిలీ మద్యం స్కామ్ బయట పెట్టిందే కూటమి ప్రభుత్వమని గుర్తు చేశారు. ఇందులో సొంత పార్టీ నాయకుల ప్రమేయం ఉందని వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఇది తమ చిత్తశుద్ధి అని ధీమా వ్యక్తం చేశారు. సిట్ విచారణలో అన్ని విషయాలు త్వరలోనే బయటపడతాయని ఆయన అన్నారు.

# నేడు ఢిల్లీలో ఏఐ హబ్ చారిత్రాత్మక ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

డాలర్ల (దాదాపు రూ.87,250 కోట్లు) భారీ పెట్టుబడితో 'గూగుల్ ఏఐ హబ్' ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో ఒకటిగా నిలవబోతున్న ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించి మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ ప్రతినిధుల మధ్య కీలక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరగనుంది. ఈ ఒప్పందంతో విశాఖపట్నం దేశంలోనే తొలి కృత్రిమ మేధస్సు నగరంగా రూపాంతరం చెందనుంది. ఢిల్లీలోని మాన్‌సింగ్ హెూటల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ ఒప్పందంపై సంతకాలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతినిధులు, గూగుల్ ఉన్నతస్థాయి బృందం ఈ చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ ఆధారిత ఆవిష్కరణలలో దేశంలోనే అగ్రగామిగా నిలపడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గత ఏడాది అక్టోబర్ 31న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన సందర్భంగా ఈ ప్రాజెక్టుకు బీజం పడింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తో జరిపిన చర్చలలో ఏపీలో ప్రపంచస్థాయి ఏఐ ఎకోసిస్టమ్ ఏర్పాటుపై ప్రతిపాదన చేశారు. ఆ తర్వాత పలు దఫాలుగా జరిగిన చర్చలు ఫలించి, ఈ భారీ ప్రాజెక్టు కార్యరూపం దాల్చింది. ఈ ఒప్పందంలో భాగంగా విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌ను గూగుల్ నిర్మించనుంది. ఇది ఆసియాలోనే గూగుల్ చేపట్టే అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. అత్యాధునిక ఏఐ మౌలిక సదుపాయాలు, భారీ ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట ఏర్పాటు చేసి విశాఖను దేశ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపనుంది. 2028-2032 మధ్య కాలంలో ఏటా సగటున రూ.10,518 కోట్లను రాష్ట్ర జీఎస్‌డీపీకి చేర్చనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1,88,220 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. అంతేకాకుండా, గూగుల్ క్లౌడ్ ఆధారిత ఉత్పత్తుల ద్వారా ఏటా రూ.9,553 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. మొత్తం ఐదేళ్లలో దాదాపు రూ.47,720 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని చేరుకుంటుందని భావిస్తున్నారు.

ఈ ప్రాజెక్టుకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఆమోదం లభించింది. ప్రాజెక్టును వేగంగా పట్టాలెక్కించేందుకు సింగిల్ విండో క్లియరెన్స్, పునరుత్పాదక ఇంధన వనరులు, ప్లగ్-అండ్-ప్లే సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ చారిత్రాత్మక పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్, కృత్రిమ మేధస్సు ఆధారిత ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తనలో దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు మార్గం సుగమం అవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# అకాల వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతన్నలు.



**వరంగల్ అక్టోబర్ 13. (సమయం న్యూస్) :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు...అకాల వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు...ఎనుమాముల మార్కెట్ లో తడిసిన మొక్కజొన్నలు...మహబూబాబాద్ జిల్లా సోమ్లా తండా లో తడిసిన మొక్కజొన్నను చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న రైతులు...అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమకు నష్టం జరిగిందంటూ రైతుల ఆరోపణ...న్యాయం చేయాలని డిమాండ్

# ఖమ్మం లో కలెక్టర్ పారి శుద్ధ్య పనుల పరిశీలన



**ఖమ్మం, అక్టోబర్ 13: ( సమయం న్యూస్ )** నగరం లో సోమవారం ఉదయం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి ప్రధాన రహదారులు, పార్కులు, ప్రభుత్వ హాస్పిటల్, వైరారోడ్, ఇల్లందు క్రాస్ రోడ్, బైపాస్ రోడ్డు, శ్రీశ్రీ సర్కిల్ లలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గారు తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

# యూనిసెఫ్ కార్యక్రమాలపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీం నగర్ అక్టోబర్13( సమయం న్యూస్). :** యూనిసెఫ్ సహకారంతో రానున్న రోజుల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలపై ఆ సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశమయ్యారు. ఈనెల 15న గల గ్లోబల్ హ్యాండ్ వాష్ డే, స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి విషయాలపై ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదులో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో విజయవంతంగా సాగుతున్న విటమిన్ గార్డెన్ గురించి తెలియజేయాలని అన్నారు. సమావేశంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ ఆర్లికట్టి వెంకటేష్, కన్సల్టెంట్ ఫణీంద్ర, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా సమన్వయ కర్తలు వేణు, రమేష్ పాల్గొన్నారు.

# అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో సత్వరమే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా.
- ప్రజావాణిలో121 దరఖాస్తులు



**ఆదిలాబాద్ అక్టోబర్13( సమయం న్యూస్).** ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపుకలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సలోని.

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా ప్రాంతాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని, దరఖాస్తుదారుని అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట వ్యవధిలో , త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన 121 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, ముఖ్యంగా సోషల్ వెల్ఫేర్, , హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయం, తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అనంతరం పెండింగ్ దరఖాస్తుల పై ఆరా తీసి తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ట్రైనీ డిప్యూటి కలెక్టర్ వంశీ కృష్ణ రెడ్డి, స్రవంతి, రెవెన్యు విభాగం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన జిల్లా టెలికాం బోర్డు మెంబర్ కమ్మరి శ్రీను

- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల సిబ్బంది నిర్లక్ష్యం
- రోగుల పట్ల అవమానకర ప్రవర్తన
- ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను మళ్లింపు-



**సమయం న్యూస్ గజ్వేల్ అక్టోబర్ 13 :** గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. రోగులను గౌరవంగా చూడకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం రోజు రోజుకీ పెరుగుతోంది. వైద్యులు సిబ్బంది రోగుల పట్ల చూపుతున్న అహంకార ధోరణి, నిర్లక్ష్య వైఖరి పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వ వైద్యులు తమ బాధ్యతను విస్మరించి, ప్రైవేట్ ఆసుపత్రులకే రోగులను పంపిస్తూ కమీషన్ వ్యాపారం చేస్తున్నారనే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆసుపత్రి పరిసరాల్లో కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు (ఏజెంట్లు) తిరుగుతూ, రోగులను మాయమాటలు చెప్పి, ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇది వైద్య సేవల పట్ల ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేద ప్రజల ఆసుపత్రి. కానీ ప్రస్తుతం అది నిర్లక్ష్యం, అవినీతి, దౌర్జన్యం యొక్క కేంద్రంగా మారింది. వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోగుల పట్ల గౌరవం, నిబద్ధత కలిగిన సేవలందే విధంగా నిర్దిష్ట సూచనలు ఇవ్వాలని తెలియజేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తిరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల ఏజెంట్లపై విచారణ జరిపి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారిని తక్షణమే తొలగించాలని తెలియజేశారుప్రజల ప్రాణాలు ఆటవికంగా మారకముందే ఈ అంశంపై అత్యవసర చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి డిఎంహెచ్వో కు సమగ్ర విచారణ జరిపి ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా టెలికాం బోర్డు మెంబర్ కమ్మరి శ్రీను బిజెపి గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ మచ్చ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# శ్రీరామ్ సాగర్ రెండో దశకు కామ్రేడ్ భీమ్ రెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలి




**వరంగల్ అక్టోబర్ 13. (సమయం న్యూస్) :** శ్రీ రాం సాగర్ 2 వ దశకు మాజీ పార్లమెంటు సభ్యులు, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ భీం రెడ్డి నరసింహారెడ్డి(బి.యన్) గారి పేరు పెట్టాలి యంసిపిఐ (యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ శ్రీరామ్ సాగర్ రెండో దశ కు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యులు, ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు, అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి బి ఎన్ గారి పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈరోజు 13/10/2025 నా హైదరాబాద్ ఓంకార్ భవన్ ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకత్వం మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ... నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలై దానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన భీమిరెడ్డి నరసింహారెడ్డి గారి నేతృత్వంలో దున్నేవానికే భూమి కావాలనే నినాదంతో లక్షలాది ఎకరాలు పేదలు పంచిన గొప్ప చరిత్ర ఆనాటి పోరాటానికి ఉంది. ఆ పోరాటంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి గారు పేద ప్రజలకు వందలాది ఎకరాల భూములను పేద ప్రజలకు భూములు పంచడంతోపాటు వారికి సామాజిక ఆర్థిక రాజకీయ చైతన్యం కలిగించారు. ఇంతటి మహా ప్రదాత బి ఎన్ గారు మాజీ శాసనసభ్యులుగా,మాజీ పార్లమెంటు సభ్యులు గా సకల రంగాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా వన్నె తెచ్చిన రాజకీయ దురంధరుడు అటు అసెంబ్లీలో - పార్లమెంటు లో మరియు ప్రజా క్షేత్రంలో గోదావరి జలాల ను వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లా ల ఎగువ ప్రాంతాల్లో 30 మండలాల్లో 4 లక్షల 30 వేల ఎకరాల కు తరలించటమే సాగునీరు, త్రాగునీరు సమస్య తీరుతుంది అని ముఖ్యంగా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో గోదావరి జలాలే పంటలకు ఆదారం అని లేకుంటే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని దశల వారిగా చట్టసభల్లో - ప్రజా క్షేత్రంలో పోరాడి సాధించిన బి యన్ గారు 1996 మార్చి 6 న తిరుమల గిరి ప్రగతి నగర్ వద్ద శంకుస్థాపన చేయడం జరిగింది. గోదావరి జలాలు సాధించే వరకు ఆ జలాలు నా గొంతులో పడ్డ తరువాత నే నాకు విరమణ అని చెప్పి సాధించిన కామ్రేడ్ బి యన్ గారు 2008 మే9 న అమరత్వం పొందారు. వారి సంతాప సభ సూర్యాపేట కు హాజరై నాడు మంత్రులు గా ఉన్న జానారెడ్డి గారు, దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి గారలే స్వయంగా యస్ ఆర్ యస్ పి రెండొవ దశకు బి యన్ గారు పెట్టుటకు కృషి చేస్తాం అని దానికి నిజమైన అర్హత బి యన్ ఉంది అని ప్రకటించారు. ప్రభుత్వం లాంఛనాలు తో అంత్య క్రియలు నిర్వహించింది, రాష్ట్రపతి అవార్డు ఇచ్చి వీర పుత్రుని గా గౌరవించింది. కానీ కామ్రేడ్ బియన్ గారి చిరకాల వాంఛ అయిన గోదావరి ప్రాజెక్టు నల్గొండ కు సాధించిన బి యన్ గారి అమరత్వం పొంది 17 సంవత్సరాల నుండి యంసిపిఐ(యు) పార్టీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుసార్లు తీసుకుని వెళ్ళిన నిర్లక్ష్యం చేయడం జరిగింది. నైజాం నైవాబును పొగుడుతూ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ను తేలిక చేసి మాట్లాడిన కేసిఆర్ వైఖరిని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు గా సర్వస్వం త్యాగం చేసిన కామ్రేడ్ బి యన్ గారు కేసిఆర్ విధానం సరి కాదు అన్నందుకు గత పది సంవత్సరాల పాలనలో పట్టించు కోలేదు. నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాంరెడ్డి దామోదర్ రెడ్డి గారు మరణించగా అదికార దుర్వినియోగం తో గోదావరి జలాల సాధనలో ప్రాముఖ్యత లేని వారి పేరు పెట్టడం చరిత్రను వక్రీకరించటమే కాకుండా నల్గొండ గుండె చప్పుడు బి యన్ నే నల్గొండ, నల్గొండ నే బియన్ అని రాజకీయాలకు అతీతంగా ప్రజా మన్నను పొందిన నాయకత్వం ను ఈ ప్రభుత్వం అవమానం చేయడమే. వీర తెలంగాణ రైతాంగ సాయుధ యోధుడు గా, ఊదరబాంబు సృష్టించిన వ్యూహ కర్తగా, చాకలి (చిట్యాల)అయిలమ్మ ను కాపాడి, విసునూరు దేశ్ ముఖుల, రజాకార్ల సైన్యం ముష్కర క్యాంపు లతో తీవ్రమైన చిత్రహింసలకు గురై ఆసనాల లో బీర్ సీసాలో తో, తుపాకుల మడమలతో, రోకలి బండల థర్డ్ డిగ్రీ చిత్రహింసలకు గురై చెవులు ఇతర ముఖ్యమైన భాగాలన్నీ తీవ్రమైన దెబ్బలకు గురి చేసి, చెవుడు వచ్చే విధంగా రక్తం కారె దెబ్బలు కొట్టిన వీర తెలంగాణ యోధుడు గా దేశభక్తుడు గా కామ్రేడ్ బి యన్ చివరి వరకు జీవించి వీర మరణం పొందారు. ఆ లాంటి త్యాగధనుల ను రాజకీయాలకు అతీతంగా గౌరవించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం లు విస్మరిస్తే చరిత్ర క్షమించదు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు నిన్న సూర్యాపేట లో చేసిన ప్రకటన వెనుకకు తీసుకుని అమరజీవి కామ్రేడ్ బి.యన్ గారి పేరు యస్ ఆర్ యస్ పి 2 వ దశకు పెట్టాలని, రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి గారి పేరును ఉపసహరించుకోవాలని ఎన్సిపి తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని తెలియజేశారు. ఈ ప్రెస్ మీట్ లో వనం సుధాకర్ తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు మైదం శెట్టి రమేష్, తుడుం అనిల్ కుమార్, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు. వనం సుధాకర్ ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

# ప్రజావాణి లో 56 ఫిర్యాదులు వచ్చాయి

- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్
- ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను
- సత్వరమే పరిష్కరించాలని
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.







**వికారాబాద్, అక్టోబర్,13(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో 56 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్,ట్రైనీ కలెక్టర్ హార్స్ చౌదరి, డి ఆర్ ఓ మంగ్లీ లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు వచ్చాయని, అట్టి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచ కుండా ఎప్పటికప్పుడున జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

14-10-25 Samayam_Layout 1 10/14/2025 2:39 AM Page 7



# బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు

## - కలెక్టర్ ఆదర్శ్ సురభి







**వనపర్తి మున్సిపాలిటీ, (మం),అక్టోబర్,13(సమయం న్యూస్):** బాల్య వివాహాలు చేస్తే వధూ వరుల తల్లిదండ్రులతో పాటు వివాహంలో పాల్గొన్న ప్రతి ఒకరి పై కేసు నమోదు చేయడం జరుగుతుంది వనపర్తి జిల్లాలో మాధ్యలోనే చదువు మానేసిన 181మంది విద్యార్థులను తిరిగి కళాశాలల్లో చేర్పించాలి - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లాలో బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అందుకు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సెప్టెంబర్ 17 నుండి ప్రారంభమైన పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన లక్ష్యాలు, చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో 498 మంది ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలను ఎన్.ఆర్.సి. సెంటర్ లో వైద్యంతో పాటు పౌష్టికాహారం అందించి వైద్యం చేయించినట్లు తెలిపారు. జనవరి, 1 నుంచి ఇప్పటి వరకు వనపర్తి జిల్లాలో 31 బాల్య వివాహాలు కేసులు నమోదు అయినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 181 మంది విద్యార్థులు కళాశాల నుండి మధ్యలోనే చదువు మానేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో 121 అబ్బాయిలు ఉండగా 60 మంది అమ్మాయిలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ చదువు మానేసిన అమ్మాయిలు ఎక్కడున్నారో గుర్తించి తిరిగి కళాశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోను జిల్లాలో బాల్య వివాహాలు నిర్వహించడానికి వీలు లేదని ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే మాత్రం అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులతో పాటు వివాహంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి పై చట్టరీత్య కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అక్టోబర్ 15న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామస్థాయి కమిటీలు సమావేశాలు నిర్వహించి అదే రోజున మండల కమిటీలో ఏర్పాటు చేయాలని డి.పి.ఓ, డి.ఆర్.డి. ఎ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 17న జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల కు సంబంధించిన ముందస్తు సమాచారం 1098 లేదా 100 లేదా 112 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. పౌష్టికాహార లోపంతో ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యవంతులుగా ఉండేటట్లు సంబంధిత అంగన్వాడి కార్యకర్తలు చూసుకోవాలని సూచించారు. ఈ వారంలో తల్లి పాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, అవగాహన కార్యక్రమానికి గర్భిణీ, బాలింత మహిళల భర్తలు సైతం సదస్సుకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. అనంతరం ఆర్.డి.ఎస్. స్వచ్ఛంద సంస్థ చిన్నమ్మ థామస్ వారు రూపొందించిన "ఇచ్చట బాల్య వివాహం నిర్వహించబడవు" అనే గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిల్లలకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు పాల్గొని అన్న ప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు, గర్భిణులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి పి డి ఆర్ డి ఓ ఉమాదేవి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్లు ఎన్నికల స్టంట్

**కామారెడ్డి బిసి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం**

**స్థానిక మెజార్టీ స్థానాలు మావే**

**తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చకుంటే రిజర్వేషన్ల అమలు అసాధ్యం**

**బి ఎమ్మెల్సీ , ఖమ్మం జిల్లా బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు**



**ఖమ్మం , అక్టోబర్13 : ( సమయం న్యూస్ ) :** స్థానిక సంస్థల ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లు కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని , కామారెడ్డి బిసి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలకు మాత్రమే కాదని యావత్ తెలంగాణ ప్రజలకు మోసం చేసిందని ఎమ్మెల్సీ , ఖమ్మం జిల్లా బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు , 42% రిజర్వేషన్లు , కోర్టు స్టే అంశాలపై సమయం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి యం డి. షఫీ యు జమ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో .... పార్టీ స్టాండ్ , తన అభిప్రాయాలను ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మెజార్టీ స్థానాలు తమవే అని తెలుపుతూ ఈ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చకుంటే అమలు సాధ్యం కాదన్నారు. ఇది తెలిసి కూడా కావాలని అమలు కానీ హామీలతో కాంగ్రెస్ నాయకులు మోసానికి పాల్పడు తున్నారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము సన్నద్ధంగానే ఉన్నామని వివరిస్తూ ఇలాంటి అడ్డంకులు వస్తాయని ముందుగానే ఊహించిన తమ ప్రభుత్వం , తమ ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక రూట్ మ్యాప్ ను రూపొందించారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ రూట్ మ్యాప్ ను అనుసరించక, అమలు చేయక తప్పదని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని చిత్తశుద్ధి , నిబద్ధత ఈ ప్రభుత్వానికి లేదని నిజంగా బీసీల పట్ల ప్రేమ , కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పై శ్రద్ధ ఉంటే ... కోర్టు లో స్టే విధించే పరిస్థితి ఏర్పడేది కాదని , అసలు ఆ పరిస్థితి వచ్చేది కాదని వెల్లడించారు. సుప్రీంకోర్టు గతంలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదు అన్న విషయం ఈ ప్రభుత్వానికి తెలియదా ? అంటూ ప్రశ్నించారు. ఈ ప్రక్రియ సందర్భంగా సంపూర్ణంగా చేయాల్సిన ప్రక్రియను చేయకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని , తమ ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలోనే ఇలాంటి ప్రక్రియను పూర్తిగా ప్రారంభించారని దానిని నేడు సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్థానిక సంస్థలలో ఎన్నికల అవగాహన లేదా పొత్తులు అంశంపై బి ఆర్ ఎస్ స్టాండ్ గురించి అడిగిన ప్రశ్నకు స్థానిక సంస్థల ఎన్నికలలో ఖమ్మం జిల్లాకు సంబంధించి ప్రస్తుతం తమ పార్టీ సిపిఎంతో ఒక అవగాహన కుదుర్చుకుందన్నారు. ఇతర పక్షాల గురించి అనే ప్రశ్నకు జవాబుగా స్థానిక పరిస్థితులు , స్థానిక నాయకత్వం బట్టి అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో తమకు ప్రచారాస్త్రాలుగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి 420 హామీలనే ఉపయోగిస్తామన్నారు. గవర్నర్ వద్ద రిజర్వేషన్ అంశంపై ఫైలు పెండింగ్ లో ఉండగా జీవో 9 ని తీసుకొచ్చి , 42 రిజర్వేషన్లపై నోటిఫికేషన్ జారీ చేయడం విస్మయం కర అంశం అన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధ చర్యగా అభివర్ణిస్తూ ఈ రిజర్వేషన్లు అమలు కావని తెలిసి , ముందుకు పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగానే రాజ్యాంగం , చట్టం , రిజర్వేషన్ల ప్రక్రియ గురించి తెలియదా అంటే తెలుసు కానీ ప్రజలను మోసం చేయడమే వారి లక్ష్యంగా దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని ముగించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము సన్నద్ధంగానే ఉన్నామని ఎమ్మెల్సీ , బి ఆర్ ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు స్పష్టం చేశారు

# సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకం

**● పి .ప్రావీణ్య ,జిల్లా కలెక్టర్**




**సంగారెడ్డి అక్టోబర్13( సమయం న్యూస్). :** కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా ౧- జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం - 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడారు ... ప్రతి సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకమని, సమాచార హక్కు చట్టం నిర్వహణలో పారదర్శకత ప్రామాణికమని, అభ్యర్థులు దరఖాస్తు ద్వారా కోరిన సమాచారాన్ని చట్టం నిబంధనలకు లోబడి అధికారులు వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారుల వివరాలతో బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని అన్నారు. ఈ చట్టం అమలు ద్వారా పని సామర్థ్యం పెరుగుతుందని, దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఈచట్టంలో పొందుపర్చిన మినహాయింపులు తప్ప మిగతా అన్ని విషయాల్లో ప్రజలు కోరిన సమాచారాన్ని చట్టం ప్రకారం అందించాలి. సమాచార హక్కు చట్టం 2005 ద్వారా సామాన్య ప్రజలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం తెలుసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఈ చట్టం కింద వచ్చినా ఈ చట్టం కింద వచ్చిన దరఖాస్తులను నిర్మిత గడువు లోగా సమా చారం అర్జీదారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశే ఖర్ ,మాధురి ,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పనుల పరిశీలన



**కొత్తపల్లి మండలం,అక్టోబర్,13(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం లోని కొత్తపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణారావు పంచాయతీ కార్యదర్శి శ్రీను తో కలిసి పరిశీలించారు. గ్రామంలో మొదటి విడతలో 21 ఇల్లు మంజూరు కాగా 15 ఇండ్లు కొనసాగుతున్నట్లు వీరందరికీ మొదటి విడతగా లబ్దిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయబడినది అలాగే మిగిలిన ఆరు మంది లబ్ధిదారులు వారి యొక్క ఆర్థిక పరిస్థితి లేని కారణంగా నిర్మించలేకపోతున్నారని తెలియజేశారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో వర్షాకాలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులలో జాప్యం జరిగిన గ్రామాలలో పంచాయతి కార్యదర్శులు ఎప్పటికప్పుడు నివేదికలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు.

# జక్కలొద్దని గుడిస వాసులకు ఇంటి నెంబర్లు వెంటనే ఇవ్వాలి





**వరంగల్ అక్టోబర్ 13. (సమయం న్యూస్) :** వరంగల్ నగరంలో ని జక్కలొద్దీ గుడిసె వాసులకు ఇంటి నంబర్లు ఇవ్వాలని, మంచినీరు, కరెంటు, రోడ్లు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కమిషనర్ గారికి వె-ంమోరాండం సమర్పించడం జరిగింది

# ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 4 ఏ.టి.సి. సెంటర్లు ఏర్పాటు

## ● ఖమ్మం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, అక్టోబర్ 13 : ( సమయం న్యూస్ ) :** రాబోయే టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేలా ఏ.టి.సి. ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కాలంటే రొటీన్ గా ఉన్న ఐటిఐ కోర్సులు కాకుండా ప్రస్తుత పరిశ్రమల అవసరాల ప్రకారం నైపుణ్య కోర్సులను డిజైన్ చేయించి ఆధునిక సాంకేతిక కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. రాబోయే 5 నుంచి 10 సంవత్సరాల వరకు ప్రపంచీకరణలో జరిగే మార్పులకు అనుగుణంగా ఏటీసీ కోర్సులు డిజైన్ చేయడం జరిగిందని అన్నారు. ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు.

ఆధునిక సాంకేతిక కేంద్రంలో అందించే కోర్సులను పూర్తి చేసే ముందే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా టాటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అన్నారు. నిర్వీర్యమైన ఐటిఐలను యువత కు ఉపయోగపడే విధంగా ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం తీర్చిదిద్దిందని అన్నారు. యువతకు ప్రపంచంలో ఎక్కడైనా బ్రతికే శక్తి సామర్థ్యాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ కు ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ప్రస్తుతం ఏసీ లకు చాలా డిమాండ్ ఉందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రపంచం చూస్తుందని, దానికి సంబంధించిన మెకానిక్స్ లో మనం నిష్ణాతులం కావాలని మంత్రి అన్నారు. ప్రస్తుత ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డిమాండ్ తగ్గిపోయిందని, అక్కడ ప్రాక్టికల్స్ పరిజ్ఞానం తక్కువగా ఉండటం, కోర్సులు అప్ డేట్ కాకపోవడం వల్ల బీటెక్ చదివినా కూడా ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు సరిపోవడం లేదని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు మంచి నైపుణ్యాలు అందించాలని లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఖమ్మం, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలలో 4 ఏ.టి.సి. లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలకు అవసరమైన ఉపాధి ట్రైనింగ్ శిక్షణ విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏటీసీ కేంద్రంలో ఉన్న కోర్సుల ద్వారా ప్రపంచంలో ఎటువంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయో విద్యార్థులకు వివరించేలా డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ కోర్సుల కన్నా మెరుగైన నైపుణ్య కోర్సులు ఏటిసిలో అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. క జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను నేడు ప్రారంభం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తు పరిశ్రమల డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని ఏ.టి.సి. కోర్సులను ప్రభుత్వం డిజైన్ చేసిందని అన్నారు.

రంగారెడ్డి జిల్లాలో ఫాక్స్ కాన్ ఇయిర్ పాడ్స్ ఉత్పత్తి పరిశ్రమ ఉందని, మన ఏ.టీ.సి. లో రోబోటిక్స్ పూర్తిచేసే విద్యార్థులకు అటువంటి పరిశ్రమలో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తుందని, దాని నిర్వహణ, మరమ్మత్తుల కొరకు ప్రత్యేక కోర్స్ అందిస్తున్నామని తెలిపారు.. పోలీస్. కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ దేశంలో స్కిల్ గ్యాప్ బాగా ఉందని, విద్యార్థులు చేసే కోర్సులకు, బయట పరిశ్రమల అవసరాలకు చాలా తేడాలు ఉన్నాయని గమనించిన ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఏటీసీ సెంటర్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి మన రాష్ట్రంలో పెరుగుతుందని, ఈ రంగం వైపు యువత దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఏటిసి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కార్మిక శాఖ సహాయ కమీషనర్ కృష్ణవేణి, స్థానిక కార్పొరేటర్ సత్యనారాయణ, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వంటనూనె గింజల మిషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి




**పరిగి మున్సిపాలిటీ(మం)అక్టోబర్,13(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ తినదగిన నూనె (వంటనూనె) గింజల మిషన్ (ఎన్ఎమ్ఇఒఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోమ, పూడూరు, పరిగి తదితర మండలాలకు చెందిన రైతులకు నూనె గింజల విత్తనాలను పంపిణీ చేశారు. పంటల ఉత్పత్తి పెంపుతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే టిఆర్ఆర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## బిజెపిలో ఖమ్మం న్యూరో సర్జన్ మారుతి గౌడ్ చేరిక



**ఖమ్మం, అక్టోబర్13 : ( సమయం న్యూస్ )** జిల్లాకు చెందిన ప్రముఖ డాక్టర్, న్యూరో సర్జన్ కె. మారుతి గౌడ్ సోమవారం అధికారికంగా బిజెపి పార్టీలో చేరారు. హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర బిజెపి కార్యాలయం లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు మారుతి గౌడ్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. డాక్టర్ తో పాటు మరో 50 మందిని కూడా బిజెపి కండువా కప్పారు. ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి వాసుదేవ రావు, సన్నీ ఉదయ్ ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరరావు, మండడపు సుబ్బారావు,ఆకుల నాగేశ్వరావు, బోయినపల్లి సురేష్,కొండా గోపి, రుద్రగాని మాధవ్,గో పి పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం



**కొత్తపల్లి మండలం, అక్టోబర్,13(సమయం న్యూస్) :** ప్రధాని నరేంద్ర మోదీ వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో వెనుకబడిన జిల్లాలను ప్రగతి బాటపట్టించెందుకు నారాయణ పేట జిల్లాను ఎంపిక చేయడం పట్ల సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండల కేంద్రంలో ప్రదాన మంత్రి మోదీ చిత్ర పటానికి మండల బీజేపి నాయకులు, కార్యకర్తలు పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపి రాష్ట్ర కార్యదరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో నాలుగు వెనుకబడిన జిల్లాలను ఎంపిక చేసి అందులో నారాయణ పేట జిల్లాను ఎంచుకోవడంలో ముఖ్య భూమిక వహించిన ఎంపి డీకే అరుణమ్మకు కృతజ్ఞతలు తెలుపుకోవాలని సూచించారు. ఈ పథకంలో నారాయణ పేట జిల్లాకు ప్రతి ఏడాది రుపాయలు 240 కోట్లతో ఆరెళ్ల పాటు కేంద్రములోని 11 మంత్రిత్వ శాఖల పరిదిలోని 36 పథకాలను సమ్మిళితం చేసి పిఎండీడికేవైని అమలు చేస్తారన్నారు. కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాల అనుసంధానం ప్రయివేటు చేకూరుతుందని భాగస్వామ్యంతో రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా కార్యదర్శి బాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కేశవ రెడ్డి, పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, రవి గౌడ్, విశ్వనాథ్ రెడ్డి, బాల్ రెడ్డి, శ్రీనివాస్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంచ గచ్చిబౌలి భూములపై మరో వివాదం.

**డిల్లీ అక్టోబర్13( సమయం న్యూస్). :** హైదరాబాద్ లో నీ ట్రిపుల్ ఐటీ కంచ గచ్చిబౌలి భూములపై మరో వివాదం తెర పైకి వచ్చింది.. 2,725 ఎకరాల 23 గుంటల భూమికి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిజమైన యజమాని, ఆ భూములపై యాజమాన్య హక్కు తమదేనని నిజాం వారసులు ఆరోపిస్తున్నారు. కంచి గచ్చిబౌలి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ.. సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వానికి ఇప్పటికే లీగల్ నోటీసులు జారీ చేశామని వారు చెబుతున్నారు..తెలంగాణ ప్రభుత్వం బడా కంపెనీలకు దారాదత్తం చేయాలని నిర్ణయమం పై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేయడం ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు తో రేవంత్ సర్కారు వెనుక కు తీసుకున్న విషయం అందరికీ తెలిసిందే.

అదే భూముల పై మరొక సారి చర్చ కు దారి తీసింది.

# బాణసంచా విక్రయదారులు తప్పకుండా సంబంధిత పోలీసు అధికారి అనుమతి తీసుకోవాలి

- వనపర్తి జిల్లా ఎస్పీ -రావుల గిరిధర్(ఐపీఎస్)
- బాణసంచా విక్రయదారులపై పోలీసుల ప్రత్యేక నిఘా
- నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన, తయారుచేసిన, విక్రయాలు జరిపిన చట్టపరమైన చర్యలు తప్పవు





**వనపర్తి మున్సిపాలిటీ (మం)అక్టోబర్,13(సమయం న్యూస్)**

వనపర్తి జిల్లా ప్రజల భద్రత, క్షేమం దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ఐపీఎస్. అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయాల కోసం డివిజినల్ స్థాయి పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వచేసిన, తయారుచేసిన, దుకాణాలను నెలకొల్పిన, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా విక్రయాలు జరిపినా, ప్రేలుడు పదార్థాల చట్టం -1884 మరియు రూల్స్-1933 సవరణ 2008 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా వనపర్తి జిల్లా పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండాటపాసుల విక్రయ దుకాణాలు రద్దీ ప్రదేశాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు,విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు లేదా పెట్రోల్ బంకులు సమీపంలో వివాదాస్పద స్థలాలలో ప్రజలు నివసించే ప్రాంతాలలో ఏర్పాటు చేయకుండ సంబంధిత అధికారులు తహసీల్దార్, ఫైర్ విభాగం మరియు పోలీసుశాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు బాణసంచ విక్రయాలను తగు జాగ్రత్తలు తీసుకొంటూ జరుపుకోవాలని ఎస్పీ తెలిపారు.

**బాణసంచా దుకాణాదారులు తప్పక ఈ క్రింది నిబంధనలు పాటించాలి**

టపాకాయల దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పవలెను. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికేటు పొందపర్చాలి.ఒక క్లస్టర్ లో 50 షాపులకు మించరాదు.జనరద్దీగల ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయరాదు.జనవాసాలు లేని బహిరంగ ప్రదేశాలలో మాత్రమే టపాకాయల షాపుల ఏర్పాటు చేసుకోవాలి.దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, రెండు ఫైర్‌ఎక్స్‌ట్రిమిషన్‌లు ఉంచాలని సూచించారు.బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలి. టపాసుల దుకాణానికి నిర్ధేశిత రుసుము చెల్లించి. విధ్యుత్, ఫైర్ శాఖతో పాటు మున్సిపల్ శాఖల అనుమతి తప్పనిసరి.ఈ లైసెన్సులు 3 రోజుల కోసం మాత్రమే వర్తిస్తాయి.200 లీటర్ల వాటర్ బ్యారల్. నాలుగు ఇసుక బకెట్లు, నీటి బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి.దుకాణంలో ల్యాంప్‌లు, పెట్రోమ్యాక్స్‌లు పాత కరెంట్ తీగలు ఉంచరాదు. జాయింట్ కేబుల్స్ వాడవద్దు. జనరేటర్ 15 నుంచి 20 మీటర్ల దూరంలో ఉండాలి.దుకాణంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన వారే పనిచేయాలి.గోదాం ఊరికి 5 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలి.

# గౌరవ పాత్రికేయులకు ఉద్యమ నమస్సులు

- "సుప్రీంకోర్టు సిజెఐ పైన దాడి చేసిన
- వ్యక్తి పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి "






**వరంగల్ అక్టోబర్ 13. (సమయం న్యూస్) :** "సిజెఐ పై జరిగిన దాడికీ నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి"ముఖ్య అతిథి బిర్రు మహేందర్ మాదిగ

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి గారి పైన దాడి చేసిన రాకేష్ కిషోర్ పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందరర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ రోజు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి పిలుపు మే-రకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ జస్టిస్ బి ఆర్ గవాయి గారి మీద కోర్టులో జరిగిన దాడిని కేవలం అది ఆయన మీద జరిగిన దాడిగా కాకుండా యావత్తు భారతదేశంలో ఉన్న దళితుల మీద జరిగిన దాడిగా భారత రాజ్యాంగం మీద జరిగిన దాడిగా ఈ భారత దేశ న్యాయ వ్యవస్థ మీద జరిగిన దాడిగా చూస్తున్నట్టు ఆయన తెలిపారు. సిజెఐ పై దాడి చేసిన రాకేష్ కిషోర్ అనే లాయర్ కుల దురాహంకారంతోనే దాడి చేశాడని అది వ్యక్తిగత కక్షతోనే దాడి చేశాడని అర్థమవుతుందని అన్నారు. దానికి ఉదాహరణగా జస్టిస్ గవాయి గారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీలకు అనుకూలంగా మాట్లాడటానికి సుప్రీంకోర్టు మొదలుకుంటే జిల్లా కోర్టుల వరకు ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు ఉండాలని ఆయన పలుమార్లు మాట్లాడడాన్ని జీర్ణించుకోలేకనే అగ్రకులాలలోని కొంతమంది న్యాయవాదులు ఇలా కుల దురాహంకారంతో దాడులకు తెగపడ్డారని ఇది ఒక ఉదాహరణగా మనం చెప్పుకోవచ్చుని. దేవుడు విషయంలోనే గవాయి గారు తప్పుగా మాట్లాడారని అంటున్న లాయర్ అదే సుప్రీంకోర్టులో రామ మందిరం విషయంలో ఆనాడు తీర్పునిచ్చే న్యాయమూర్తులలో నలుగురు ఏ ధర్మం గురించి అయితే చెబుతున్నారో ఆ ధర్మంను అనుసరించే వారే అప్పుడు న్యాయమూర్తులుగా ఉన్నారని అప్పుడు రాముడు ఇక్కడే జన్మించాడా అందుకు తగిన ఆధారాలు ఉన్నాయ ... ? అని ఆ యొక్క న్యాయమూర్తులు అడిగినప్పుడు అది కూడా దేవుడి విషయమే కాబట్టి మరి అప్పుడు ఎందుకు రామ మందిరం విషయంలో వాదించే లాయర్లు ఆ న్యాయవాదుల మీద దాడి చేయలేదో ఇప్పుడు మాత్రమే గవాయి గారి మీద దాడి ఎందుకు చేశారో ... ?? సమాజంలో ఉన్న దళితులందరూ మరియు మేధావులందరూ గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఈ కుల దురాహంకారాలు మానుకొని దళితుల మీద దాడులు చేసుడు మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ఇలాంటి దాడులు ఆపకపోతే భవిష్యత్తులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో దేశంలో ఉన్న దళితులను అందర్నీ ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. అనంతరం సుప్రీంకోర్టులో సీజేఐ గారి మీద దాడి చేసిన వ్యక్తి పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా ఉండడం కోసం బలమైన చట్టాలు తేవాలని విజ్ఞప్తితో కూడిన వినతి పత్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ హనుమంతు రావ్ గారికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ...ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్ర స్వామి మాదిగ ,ఎమ్మార్పి యస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ,ఎమ్మార్పియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగ స్వామి మాదిగ,ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు దుబ్బ దానయ్య మాదిగ ,ఆలేరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య మాదిగ,ఎమ్మార్పియస్ ఎంఎస్పీ వి ఎచ్ పియస్ నాయకులుసోలిపేట రామ స్వామి మాదిగ, బండారు శివశంకర్ మాదిగ, కందుల నర్సింగ్ రావ్ మాదిగ, కోట ఉపేందర్ మాదిగ, పాముకుంట్ల బస్వయ్య మాదిగ, గురుకు యాదగిరి మాదిగ, మైలారం జంగయ్య మాదిగ,పుల్లూరి రవి కుమార్ మాదిగ, కోళ్ల జహంగీర్ మాదిగ,చీమకాండ్ల శ్రీనివాస్ మాదిగ, ఎడ్ల లింగ స్వామి మాదిగ, కేశవులు మాదిగ, కంతి సాయి కుమార్ మాదిగ,బొర్ర నర్సింహ్మా మాదిగ లతో పాటు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధం సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

సామాజిక ఉద్యమ నమస్సులతో
బిర్రు మహేందర్ మాదిగ
MRPS జిల్లా ఇంచార్జ్
యాదాద్రి భువనగిరి జిల్లా

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు



**కోస్గి మున్సిపాలిటీ(మం)అక్టోబర్,13(సమయం న్యూస్)**

భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.సోమవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణ కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో మోడీకి పాలాభిషేకం నిర్వహించారు.ఈసందర్భంగా రాష్ట్ర కార్యావర్గ సభ్యులు నాగులపల్లి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి దన్ దాన్య యోజన స్కీమ్ లో నారాయణపేట జిల్లాను ఎంపిక చేసి రైతులకు 36 రకాల పథకాలను సబ్సిడీతో అందించి 1440 కోట్ల రూపాయలు ఆరు సంవత్సరాల గాను జిల్లాలో ఉండే రైతులకు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. జిల్లాలో ఉండే రైతులు పాడి పశువులకు పప్పు ధాన్యాలకు పండ్ల తోటలు కాకుండా అనేక రకాల వ్యవసాయ పరికరాలు సబ్సిడీతోటి ఆరు సంవత్సరాల గాను రైతులు ఉపయోగించుకునే విధంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోని వెనుకబడిన నారా యణపేట జిల్లాను చేర్చినందుకు రైతుల తరపున ప్రధాని నరేంద్ర మోడీకి పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వర్ కోటకొండ రాము,మండల పార్టీ మాజీ అధ్యక్షులు సిబి వెంకటేష్,బీడీల శ్రీకాంత్, దామోదర్ రెడ్డి, గంగిరెడ్డి, శ్రీనివాస్, రాఘవేందర్,సంగప్ప తదితరులు పాల్గొన్నారు


# రామిరెడ్డి గూడ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఆత్మహత్యకు పాల్పడిన యు .ప్రియాంక మరణం పై విచారణ.

- జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి.



**మహబూబ్ నగర్ అక్టోబర్13( సమయం న్యూస్).:** మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్ రూరల్ మండలం రామిరెడ్డి గూడ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాలలో ఇంటర్మీడియర్ మొదటి సంవత్సరం చదువుతున్న యు.ప్రియాంక సోమవారం ఉదయం 7.10 నిమిషాల ప్రాంతంలో గురుకుల కళాశాల హాస్టల్ బాత్ రూం కిటికీ కి ఉరి వేసుకుని చనిపోయిన ఘటన పై అధికారులతో విచారణ జరుపనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు.ఉదయం 10.15 గంటల ప్రాంతంలో ఆమె మృత దేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కి తీసుకురావ్వడం జరిగింది.జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి.లో విద్యార్థిని మృత దేహాన్ని ఉంచిన ఐ సి. యు వార్డ్ కు వెళ్ళి విద్యార్థిని తండ్రి యు.నాగయ్యను పరామర్శించి వ్యక్తం చేశారు.సంఘటన గురించి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ తో మాట్లాడి తెలుసుకున్నారు.జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీరా తో మాట్లాడి మృత దేహానికి పోస్ట్ మార్టం నిర్వహించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు ఉన్నారు

# కొండా లక్ష్మా రెడ్డి మృతి పట్ల టీయూడబ్ల్యూజే, ఐజేయు సంతాపం



**హైదరాబాద్ అక్టోబర్13( సమయం న్యూస్). :** చేవెళ్ల మాజీ శాసనసభ్యులు, ఎన్ఎస్ఎస్ వార్తా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొండా లక్ష్మారెడ్డి (84) మృతి పట్ల ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయు) జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, కె. రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె. రాములులు ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మనుమడైన లక్ష్మారెడ్డి గతంలో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గ్రీవెన్స్ సెల్ అధికార ప్రతినిధిగా పలు హోదాల్లో పని చేశారని వారు తెలిపారు. 1999, 2014 లో రెండు పర్యాయాలు లక్ష్మారెడ్డి హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ కూడా చేశారన్నారు. జర్నలిజం వృత్తి పట్ల గల ఆసక్తి, నిబద్ధత కారణంగా 1980లో ఆయన న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్(ఎన్ఎస్ఎస్) అనే ఒక వార్తా సంస్థ ప్రారంభించారని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా, జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జర్నలిస్టులకు లక్ష్మారెడ్డి సేవలందించారని వారు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజేలో కొండా లక్ష్మారెడ్డి తో కలిసి పని చేసిన సందర్భాలను, ఆయన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

## సివిల్ వివాదాల్లో పోలీసులు తల దూర్చవద్దు.

# గీత దాటితే వేటు తప్పదు

- తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి..



**హైదరాబాద్ అక్టోబర్13( సమయం న్యూస్) :** సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చ వద్దని, సివిల్ వివాదాలను పరిష్కరించిన పోలీసు స్టేష న్లు, సంబంధిత అధికారులపై తక్షణమే వేటు పడుతుందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి హెచ్చరించారు. హోం గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకూ ఎవరూ సివిల్ వివాదాల్లో తల దూర్చ వద్దని కోరుతూ రాష్ట్ర పోలీసుల నుద్దేశించి రాసిన అంతర్గత లేఖలో డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. సివిల్ వివాదాలు సివిల్ కోర్టుల పరిధి లోకి వస్తాయన్న సంగతి ప్రతి పోలీసుకూ తెలుసునని, అయినా.. వాటిపై దృష్టి సారించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పోలీసు యూనిఫామ్, అవినీతి కలిసి ఉండ కూడదన్న డీజీపీ.. అవినీతి, అక్రమాలపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే ప్రజల్లో నమ్మకం పోతుందని చెప్పారు..

## రాచకొండలోని పెద్దంబర్‌పేటలోని సదాశివ గేటెడ్ కమ్యూనిటీ నివాసితులకు దొంగతనం షాక్

**హైదరాబాద్ అక్టోబర్13( సమయం న్యూస్) :** హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పెద్దంబర్‌పేటలో ఉన్న సదాశివ గేటెడ్ కమ్యూనిటీలో దొంగలు రెండుసార్లు దాడి చేశారు, స్థానికులు ఆందోళన చెందారు మరియు భద్రత గురించి ఆందోళన చెందారు.....సమాజం పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటున్నప్పటికీ సెంట్రల్ లాక్ తలుపులను పగులగొట్టి దొంగలు రెండు ఇళ్లలోకి చొరబడ్డారు.... దొంగిలించబడిన వస్తువులలో 5 కిలోల వెండి వస్తువులు, 35 గ్రాముల బంగారం, ₹60,000 నగదు మరియు విలువైన చీరలు ఉన్నాయి...ఈ దొంగతనాలు కమ్యూనిటి CCTV కెమెరాలలో రికార్డయ్యాయి..

# అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

- విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**భద్రాద్రి కొత్త గూడెం అక్టోబర్13( సమయం న్యూస్). :** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల వసతుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో సోమవారం పాత కొత్తగూడెం ప్రాంతంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, వసతులు, మధ్యాహ్న భోజన వంటశాల, శానిటేషన్ వ్యవస్థలను ప్రత్యక్షంగా పరిశీలించారు.మధ్యాహ్న భోజన వంటశాలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, శుభ్రత, మరియు మెనూ వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ముఖ్యమైన పాత్ర వహిస్తున్నందున, ప్రతి రోజూ నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని సూచించారు. గుడ్లు, కూరగాయలు, పాలు వంటి పోషక పదార్థాలను తప్పక భోజనంలో చేర్చాలని ఆదేశించారు.

కలెక్టర్ గుడ్లు వండుతున్నారా? అని ప్రశ్నించినప్పుడు సిబ్బంది, టెండర్ సంస్థ నుండి సరఫరా లభించలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, జిల్లావ్యాప్తంగా ఉన్న యూఆర్ఎస్ మరియు కేజీబీవీఎస్ పాఠశాలల్లో కూడా ఇటువంటి సమస్యలు ఉన్నాయో గుర్తించి, తక్షణమే నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆహార సరఫరాలో ఎటువంటి అంతరాయం రాకుండా నాణ్యతతో కొనసాగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.పాఠశాల పరిధిలోని మరుగుదొడ్లు, స్నానగదులు, హాస్టల్ గదులను కలెక్టర్ పరిశీలించారు. కొన్ని సెప్టిక్ ట్యాంకులు బ్లాక్ అయ్యి ఉన్నాయని సిబ్బంది తెలియజేశారు. వీటి మరమ్మతులు సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా వెంటనే చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను శుభ్రపరచి, దోమల పెరుగుదలను నివారించడానికి సమయానుకూల చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల హాజరు, పాఠశాల విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ వంటి అంశాలను కలెక్టర్ సవివరంగా తెలుసుకున్నారు. గత సంవత్సరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు, ఈ సంవత్సరం కూడా అదే విధంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు వివరించారు.పాఠశాల భవనం విద్యార్థుల సంఖ్యకు తగినంత కాకపోవడం అంశాన్ని సిబ్బంది వెల్లడించారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేలా చూడటం మన అందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైతే పాఠశాలను నూతన భవనంలోకి మార్చడం లేదా కొత్త ప్రదేశంలో కొత్త భవనం నిర్మించడం కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.పాఠశాల పరిశుభ్రతను మెరుగుపరచడానికి ఎలక్ట్రికల్ క్లీనింగ్ మెషిన్‌ను అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి, నేర్చుకునే ఉత్సాహానికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. పాఠశాల పరిశుభ్రతలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోరాదని బలంగా సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సెక్టోరియల్ అధికారి ఏ. నాగరాజ శేఖర్, ఏఈ రాజమౌళి, పాఠశాల ప్రత్యేక అధికారి రాంబాయి, బోధన సిబ్బంది మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో అక్రమాలకు తావివ్వ వద్దు

- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా కొనుగోళ్ళు
- సరిపోను గన్ని బ్యాగులు సిద్ధం చేయండి.
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

**నిజామాబాద్, అక్టోబర్ 13( సమయం న్యూస్). :** ప్రస్తుత వానాకాలం సీజన్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలో అక్రమాలకు తావిస్తే క్రిమినల్ కేసులు పెడతామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి సోమవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసిల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్ల ఎక్కడైనా రైతులు ఆందోళనలకు దిగితే, సంబంధిత అధికారులనే బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో తహసిల్దార్లు క్రియాశీలక పాత్ర పోషిస్తూ, బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. అన్ని శాఖలతో పరస్పర సమన్వయం పెంపొందించుకుని వరి ధాన్యం కొనుగోళ్ళు సజావుగా జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి తప్పనిసరిగా అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేస్తూ, ఆ కేంద్రంలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి కేంద్రంలోనూ తాగునీరు, తగిన నీడ వంటి కనీస వసతులు అందుబాటులో ఉండాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పచ్చి ధాన్యం కోయకుండా రైతులను, హార్వేస్టర్ల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. తూకం యంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్, తేమ కొలిచే యంత్రాలు వంటివి సరిపడా అందుబాటులో ఉండాలన్నారు. క్రాప్ బుకింగ్, ధాన్యం సేకరణ వివరాలను వెంటదివెంట నమోదు చేస్తూ, రిజిస్టర్లను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు తరలించాలనేది జిల్లా యంత్రాంగం నిర్ణయిస్తుందని, ట్రక్ షీట్లలో అవకతవకలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తున్నామని, అయితే గన్నీ బస్తాల పంపిణీ ఇష్టారీతిన కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి ధాన్యం తరలించిన రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఆర్డీఓ సాయగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగవ్వ, అన్ని మండలాల తహసిల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మెడికల్, వెటర్నరీ, సమ్మిళిత గురుకులాలను స్థానికంగానే నిర్మించాలని ప్రజాభిప్రాయ సేకరణ



**కొడంగల్ మున్సిపాలిటీ(మం)అక్టోబర్,13(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ అభివృద్ధి,పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కొడంగల్ లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సంతకాల సేకరణతో వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వ్యాపారులు, కుల మత, వర్గ బేధం లేకుండా అందరూ సంపూర్ణ మద్దతు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ కోట్రీక లక్ష్మీనారాయణ గుప్తా, కో కన్వీనర్స్ గంటి సురేష్, ఎరన్ పల్లి శ్రీనివాస్,రమేష్ బాబు, వెంకట్రాం రెడ్డి, మాసాని వెంకటయ్య, పవన్ కుమార్ లాహోటి, ఫిరోజ్ ఖాన్, మాఫీ వెంకటయ్య, ప్రవీణ్, రఫిక్,రహీం, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తి మానవాళికి గొప్ప వరం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్



**వనపర్తి :అక్టోబర్,13(సమయం న్యూస్) :** వైద్య వృత్తి మానవాళికి గొప్ప వరంగా భావించి నిబద్ధతతో సేవ చేయాలనీ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సోమవారం వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025-26(4వ) విద్యా సంవత్సరం నూతనవిద్యార్థులు,తల్లిదండ్రులకు నిర్వహించిన ధోరణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్ హాజరయ్యారు. నూతన విద్యార్థులచే ప్రొఫెసర్లు మహర్షి చరక్ శపత్,తెల్ల గౌనుదారణ (ప్రతిజ్ఞ ) చేయించారు. కళాశాల నియమ నిబంధనలను విద్యార్థులు నడుచుకోవలసిన నడవడికను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతిజ్ఞ సమాజానికి వైద్య వృత్తి పట్ల సమాజానికున్న ప్రగాఢ విశ్వాసానికిప్రతీకగావిద్యార్థులుగుర్తుంచుకోవాలన్నారు. కఠోర శ్రమ, పట్టుదలతో పాఠ్యాంశాలను అభ్యసించడం ద్వారా వైద్య వృత్తిలో ఎదురైయ్యే సవాళ్ల ఎదుర్కొగ లుగుతారని సూచించారు. వైద్య విద్యలో రాణించేందుకు వైద్య కళాశాల ప్రొఫెసర్లు అన్నివిధాల సహకరించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. ఆదర్శ ప్రాయంగా ఉంటారని తెలిపారు. విద్యార్థులను నిజాయితీ,నిబద్ధత,మానవతా విలువలతో కూడిన డాక్టర్లుగా మలిచే బాధ్యత తమ పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీత,ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఇంచార్జీ సూపరిండెంట్ డాక్టర్ రంగారావు,ప్రొఫెసర్లు హరికృష్ణ, సునీల్ కుమార్, డేవిడ్ ఆనంద్, రాజేశ్వరి, జ్యోతి, రమా క్రాంతి, అనిల్, రవికుమార్,డాక్టర్ కిరణ్ మై,ఏ.ఓ రఘుకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ జోరు.

- తొలి రోజు 10 మంది అభ్యర్థులు నామినేషన్ ల దాఖలు



**హైదరాబాద్, అక్టోబర్ 13,( సమయం న్యూస్). :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో రిటర్నింగ్ అధికారి పి సాయిరాం నామినేషన్ల స్వీకరించారు. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకు పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఉపఎన్నికకు తొలిరోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో రెండు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు కాగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరుపున పూస శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అలాగే నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్ లు నామినేషన్ లు దాఖలు చేశారు.

**రిటర్నింగ్ అధికారి కార్యాలయంను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి**

జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలకు కొద్ది గంటల ముందు షేక్ పేట తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ ల ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంనుజిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంను సందర్శించి పలు సూచనలు ఇచ్చారు. నామినేషన్ ల ప్రక్రియ కోసంసన్నద్ధతను ఆర్ ఓ , ఏ ఆర్ ఓ లతో ఆయన సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ECI నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నామినేషన్ ల స్వీకరణకు సర్వ సన్నద్ధం గా ఉండాలని రిటర్నింగ్ అధికారి పి సాయిరాం కు ఈ సందర్భంగా సూచించారు.

# మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం 2025 కార్యక్రమం

- రోగుల అవగాహన & ప్రేరణ కార్యక్రమం

**ద్వారా ఆర్థరైటిస్‌పై చైతన్యం**




**హైదరాబాద్, అక్టోబర్ 13 (సమయం న్యూస్)** ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం 2025 సందర్భంగా మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రత్యేక రోగుల అవగాహన % ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం యొక్క గ్లోబల్ థీమ్ "Achieve Your Dreams(RMDreams) — రుమటిక్ మరియు మస్కులోస్కెలటల్ వ్యాధులతో జీవిస్తున్న వారికి తమ లక్ష్యాలు, ఆశలు, కలలను సాకారం చేసుకునే ధైర్యం, మార్గదర్శకత ఇవ్వడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది ఆర్థరైటిస్ రోగులు, వైద్య నిపుణులు, వెల్‌నెస్ స్పెషలిస్టులు పాల్గొని అవగాహన, ప్రేరణ, ఆరోగ్యకర జీవన విధానం గురించి చర్చించారు. సరైన చికిత్స, వ్యాయామం, ఆహారపు అలవాట్లు, మానసిక ఉత్సాహం ద్వారా బాధలేని, సార్థకమైన జీవితం సాధ్యమని ఈ కార్యక్రమం ద్వారా హాస్పిటల్ తెలియజేసింది.

**కార్యక్రమ ముఖ్యాంశాలు: నిపుణుల ప్రసంగం:**

హాస్పిటల్ రుమటాలజిస్టు డా. సౌమ్య గారు ఆర్థరైటిస్ కారణాలు, లక్షణాలు, నివారణ, తాజా చికిత్సా పద్ధతులపై మాట్లాడారు.

**ఫిజియోథెరపీ సెషన్:** హాస్పిటల్ ఫిజియోథెరపీ బృందం రోగులు రోజూ సురక్షితంగా చేయగల సులభమైన వ్యాయామాలను ప్రదర్శించింది, ఇవి కీళ్ల కదలికను మెరుగుపరుస్తాయి మరియు గట్టిదనాన్ని తగ్గిస్తాయి.

**పోషకాహార సూచనలు:** హాస్పిటల్ న్యూట్రిషనిస్ట్ సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో పాటించాల్సిన మార్గాలను వివరించారు, ఇవి కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, వాపు నియంత్రణలో సహాయపడతాయి.

**రోగుల అనుభవాలు:** ప్రేరణాత్మక రోగులు తమ స్వీయ అనుభవాలు, కోలుకునే ప్రయాణం, ఆర్థరైటిస్‌తో ఉన్నప్పటికీ ఎలా "తమ కలలను సాకారం చేసుకుంటున్నారు" అనే అంశాలను పంచుకున్నారు. సమాజ ఆరోగ్యం పట్ల తన అంకితభావాన్ని చాటుతూ, హాస్పిటల్ ఈ రోజు OPD కన్సల్టేషన్లపై 50% డిస్కౌంట్, అలాగే ఆర్థరైటిస్‌కు సంబంధించిన ఇన్-హౌస్ ల్యాబ్ టెస్టులపై 50% రాయితీ అందించింది.

**కార్యక్రమ లక్ష్యం:** ఆర్థరైటిస్‌పై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం, రోగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందేశం "సాధ్యాలను కార్యరూపం దిద్దుకుందాం" అనే ఆత్మను ఇది ప్రతిబింబించింది.

డా. సౌమ్య మాట్లాడుతూ , "ఆర్థరైటిస్ మీ కలల ముగింపు కాదు. సరైన చికిత్స, క్రమమైన వ్యాయామం, సానుకూల ఆలోచనతో రోగులు ఆరోగ్యవంతమైన, స్వతంత్ర, సంతోషకరమైన జీవితాన్ని గడపగలరు. మా లక్ష్యం వారికి ఆ ధైర్యం, మార్గదర్శకత ఇవ్వడం" అన్నారు.

మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఈ కార్యక్రమం ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ, సామాజిక బాధ్యత, రోగుల శ్రేయస్సుపై తన కట్టుబాటును మరొక్క సారి వ్యక్తం చేసింది.

**ముగింపు:** ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం 2025 సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సమాజ ఆరోగ్యానికి, రోగుల మానసిక బలానికి అంకితభావంతో ముందుకు సాగింది. వైద్య నిపుణుల మార్గదర్శకత, విద్యా కార్యక్రమాలు, ప్రేరణాత్మక సందేశాల ద్వారా ప్రతి ఆర్థరైటిస్ రోగికి ధైర్యం, ఆశ, స్ఫూర్తి కలిగిస్తూ ౦ ఈ ఏడాది థీమ్ ఆత్మను ప్రతిబింబించింది.

# దేశి శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది ఇన్ పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల అందజేత



**కొత్తగూడెం అక్టోబర్13( సమయం న్యూస్). :** చుంచుపల్లి రైతు వేదిక లో సోమవారం దేశీ కోర్సు పూర్తి చేసిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు డిప్లొమా సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులను అభినందిస్తూ, ఇప్పటి నుండి మీరు పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్స్ గా పిలవబడతారు అని అన్నారు. రైతులకు సకాలంలో సాంకేతిక సహాయం అందిస్తూ, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను గుణాత్మకంగా అవగాహన చేసుకొని, పంటల మార్పిడి, ఆయిల్ పామ్,మునగ సాగు, వ్యవసాయ భూములలో సేంద్రీయ కర్బనము పెంపొందించడం ద్వారా రైతులకు లాభదాయకంగా మార్పులు చేయాలి అని పేర్కొన్నారు. బి. సరిత్, ఆత్మ డిపిడి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మరియు క్రిమిసంహారక మందులను తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులను ప్రేరేపించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. డాక్టర్ సుధాకర్, కొత్తగూడెం %ూణూ% మాట్లాడుతూ, యూరియా ఎరువుకు బదులుగా కొంత శాతం నానోయూరియాను వాడకాన్ని సూచించారు. జిల్లా ఎరువుల డీలర్ల ప్రెసిడెంట్ సోమసుందరం, ఇన్‌పుట్ డీలర్లు తమ వ్యాపారంతోపాటు వ్యవసాయ రంగంలో సాంకేతిక మార్పులను రైతులకు చేరవేసి అధిక దిగుబడుల వైపు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని తెలిపారు. ఫెసిలిటేటర్ జె. డేవిడ్ జయపాల్ రావు మాట్లాడుతూ, రైతులకు వ్యవసాయం మరియు అనుబంధ శాఖలైన ఉద్యాన, పాడి పరిశ్రమలు మరియు చెరువుల పెంపకం పై అవగాహన కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రిగోల్డ్ సర్టిఫికెట్ పొందినవారు: భీమ్ రెడ్డి సత్యదారాయణ రెడ్డి, రాజపురంబీ సిల్వర్ సర్టిఫికెట్ పొందినవారు: తన్నీరు రాంబాబు, గోపల్లిబీ బ్రాంగ్ సర్టిఫికెట్ పొందినవారు: పొన్నోజు ప్రేమాచారి, లేడులపల్లి. సర్టిఫికెట్ పొందిన వారిని జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబు మెడల్స్ మరియు శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, పారువుల డీలర్ల సంఘం కోశాధికారి, ప్రసాద్ గారు, ఎరువుల డీలర్ల సంఘం అధ్యక్షులు, రంజిత్ మరియు టీ.ఎన్. 2675 డీలర్లు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక కేంద్రాలలో నమోదు పెంచాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ అక్టోబర్13( సమయం న్యూస్).:** జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ కేంద్రాలలో నమోదును పెంచాలని, ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలు తగ్గకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎంఈఓలు, ఎంపీడీవోలు, సిడిపివోలతో పూర్వ ప్రాథమిక పాఠశాలలపై సమీక్షించారు. జిల్లాలో నిర్వహిస్తున్న 20 పూర్వ ప్రాథమిక కేంద్రాల్లో నమోదు తక్కువగా ఉందని, వారం రోజుల్లోగా ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలను నమోదు చేయించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో ఇప్పటికే ఇన్స్ట్రక్టర్, ఆయా నియామకం పూర్తయిందని తెలిపారు. ఐసిడిఎస్, విద్యాశాఖ, ఎంపీడీవోలు సమన్వయంతో ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పన పూర్తి చేయించాలన్నారు. సమర్థవంతంగా కేంద్రాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సిడిపివోలు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



**కొడంగల్ మున్సిపాలిటీ(మం)అక్టోబర్,13(సమయం న్యూస్) :** కొడంగల్ శ్రీ బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో 1995-96 పదో తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా జరుపుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అప్పట్లో విద్య బుద్దులు నేర్పించిన ఉపాధ్యాయులు అనసూయ, పద్మ, షాహీదా బేగం, శరత్ కళ, నారాయణ లను శాలువా, పూల మాలలతో సన్మానించారు.

14-10-25 Samayam_Layout 1 10/14/2025 2:40 AM Page 11



# గెలుపు ముంగిట టీమిండియా!

**సరికొత్త హిస్టరీ లిఖించనున్న గిల్ సేన**

**విజయానికి మరో 58 పరుగుల దూరం**

**వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 ఆలౌట్**

**వికెట్ల వేటలో చెమటోడ్చిన భారత బౌలర్లు..**




వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. 121 పరుగుల లక్ష్యచేధన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. విజయానికి మరో 58 పరుగుల దూరంలో నిలిచింది. క్రీజులో కేఎల్ రాహుల్(25 బ్యాటింగ్)తో పాటు సాయి సుదర్శన్(30 బ్యాటింగ్) ఉన్నాడు. దూకుడుగా ఆడే క్రమంలో వారికన్ బౌలింగ్‌లో యశస్వి జైస్వాల్(8) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు.అంతకుముందు 173/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. జాన్ కాంప్‌బెల్(199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 115), షైహోప్(214 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 103) సెంచరీలతో చెలరేగగా.. జస్టిన్ గ్రీవ్స్(85 బంతుల్లో 3 ఫోర్లతో 50 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు.జైడెన్స్ సీల్స్(32)తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(3/44), కుల్దీప్ యాదవ్(3/104) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్(2/43) రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌కు చెరో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేయగా.. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే.వెస్టిండీస్‌ను ఆలౌట్ చేసేందుకు భారత బౌలర్లు చెమటోడ్చారు. ముఖ్యంగా జాన్ కాంప్‌బెల్, షైహోప్ జోడీని విడదీసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లు బౌలింగ్ చేసిన భారత బౌలర్లు తీవ్రంగా అలసిపోయారు. పిచ్ కూడా పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం విండీస్‌కు కలిసొచ్చింది. కాంప్‌బెల్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. సెంచరీ అనంతరం కాంప్‌బెల్‌ను జడేజా వికెట్ల ముందు బోల్తా కొట్టించడంతో వెస్టిండీస్ 252/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో షైహోప్ 204 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని మహమ్మద్ సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో విండీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. రోస్టన్ చేజ్(40), టెవిన్ ఇమ్లాచ్(12), ఖారీ పీర్రె(0)లను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. జోమెల్ వార్రికన్(3), అండర్సన్ ఫిలిప్(2)లను బుమ్రా పెలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో జైడెన్ సీల్స్‌తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ పోరాడాడు. దాంతో విండీస్ 361/9 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ సాధికారికంగా ఆడింది. ముఖ్యంగా జస్టిన్ గ్రీవ్.. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. జైడెన్ సీల్స్‌ను బుమ్రా ఔట్ చేయడంతో వెస్టిండీస్ పోరాటం ముగిసింది.



## కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించనున్నాడా!?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2008లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గత 18 సీజన్లుగా ఆడుతున్న ఆటగాళ్లను తీసుకుంటే, ప్రస్తుతం ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాత్రమే మిగిలి ఉన్నారు. 44 ఏళ్ల ధోని గత సీజన్‌లో CSK జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయి 5 సంవత్సరాలు అయింది. కానీ, గత 5 ఐపీఎల్ సీజన్లలో ధోనీ ఆడుతూనే ఉన్నాడు. రాబోయే 19వ సీజన్‌లోనూ ధోనీ ఆడతారని సిగ్నల్ ఇచ్చారు. అయితే అతను కెప్టెన్‌గా ఉంటాడా.. లేదా వికెట్ కీపర్‌గా కొనసాగుతాడా? అనేది తెలియాల్సి ఉంది. అతని కెప్టెన్సీలో ఇప్పటి వరకు 5 ఐపీఎల్ ట్రోఫీలు నెగ్గింది చెన్నై సూపర్ కింగ్స్ జట్టు. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గత రెండు సంవత్సరాలుగా జట్టుకు ప్రభావవంతమైన ఆటగాడిగా ఉన్నాడు. అతను ఓపెనింగ్ స్లాట్‌లో స్థిరమైన ఆటగాడు. అదే సమయంలో, రాబోయే 2026 సీజన్ రోహిత్ శర్మ భవిష్యత్తును నిర్ణయించే సిరీస్ అవుతుంది. ప్రస్తుతం అతని వయస్సు 38 సంవత్సరాలు. అతని కెప్టెన్సీలోనూ ముంబయి జట్టు 5 ట్రోఫీలను గెలుచుకుంది. మరోవైపు, విరాట్ కోహ్లీ 2022 నుండి అంటే గత 4 సీజన్లలో ఓపెనర్‌గా ఉన్నాడు. విరాట్ కోహ్లీ గత ఏడాది తన తొలి ఐపీఎల్ ట్రోఫీని కూడా ముద్దాడాడు. ట్రోఫీ గెలిచిన తర్వాత ఏడ్చిన విరాట్ కోహ్లీ.. ఇంకా చాలా ఏళ్లు ఆట కొనసాగించాలని భావించాడు. ఈ పరిస్థితిలో 2026కి ముందు విరాట్ కోహ్లీ ఆర్సీబీతో తన కాంట్రాక్ట్‌ను పొడిగించలేదని వార్తలు వినిపిస్తున్నాయి. దీని అర్థం అతను ఆర్సీబీతో ఎక్కువ కాలం ప్రయాణించకూడదని అనుకుంటున్నారట. త్వరలోనే విరాట్ కోహ్లీ అన్నీ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఓ క్రికెట్ విశ్లేషకులు తన వ్యక్తిగత సోషల్ మీడియాలో ఇదే అనుమానాన్ని వ్యక్తం చేశారు. తాజాగా వచ్చిన సమాచారం మేరకు 2026కు సంబంధించి విరాట్ కోహ్లీ బ్రాండ్ ఒప్పందాన్ని కొనసాగించడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ లేకుండానే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు రాబోయే ఐపీఎల్‌కు సిద్ధమవుతుందని ప్రచారం జోరుగా జరుగుతోంది. అలాగే, గత సీజన్‌లో కెప్టెన్సీని విరాట్ కోహ్లీకి ఇస్తామని మేనేజ్‌మెంట్ చెప్పిన క్రమంలో అందుకు దాన్ని తిరస్కరించినట్లు సమాచారం. కొత్త కెప్టెన్‌గా రజత్ పటిదార్‌ను ఎంపిక చేయమని సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. 2024లో భారత జట్టు ఐసీసీ టీ20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత విరాట్ కోహ్లీ టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అదే విధంగా ఈ ఏడాది టెస్టు క్రికెట్‌కు కూడా తాను రిటైర్మెంట్ ప్రకటించారు విరాట్ కోహ్లీ. దీని అర్థం విరాట్ కోహ్లీ వన్డేలు.. ఐపీఎల్‌లో మాత్రమే ఆడతాడని. 2027 ఐసీసీ ప్రపంచ కప్ వరకు విరాట్ కోహ్లీ ఆడటం కూడా సందేహమే. అలాంటప్పుడు, విరాట్ కోహ్లీ వన్డేలు ఆడే వరకు ఐపీఎల్‌లో ఆడతాడు. అతను దాని నుండి రిటైర్ అయితే, అతను ఐపీఎల్ నుండి కూడా రిటైర్ అయ్యే అవకాశం ఉంది. 2027లో విరాట్ కోహ్లీ ఐపీఎల్ నుంచి రిటైర్ అయ్యే అవకాశం ఉంది. 2028 ఐపీఎల్ సీజన్ కు ముందు మెగా వేలం జరగనుంది కాబట్టి, ఆ సమయంలో విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉంది. అందువల్ల, విరాట్ కోహ్లీ 2026, 2027 ఐపీఎల్ సీజన్లలో ఆడతాడని ఆశించవచ్చు.

## తెగ కష్టపడ్డ టీమిండియా బౌలర్లు



మూడు రోజుల్లో ముగిసిపోతుందని అనుకున్న రెండో టెస్టుని నాలుగో రోజు దాకా తీసుకొచ్చింది వెస్టిండీస్.. ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవడమే కష్టమనుకుంటే.. ఏకంగా 121 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందు ఉంచింది. 311 పరుగుల వద్ద 9వ వికెట్ పడితే ఆఖరి వికెట్ తీసేందుకు 22 ఓవర్లు పాటు ఆపసోపాలు పడింది భారత జట్టు.. జాన్ కాంపెల్, షై హోప్ సెంచరీలకు తోడు జస్టన్ గ్రీవ్స్, జేడన్ సీల్స్ ఆఖరి వికెట్‌కి జోడించిన 79 పరుగుల భాగస్వామ్యం కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో 118.5 ఓవర్లు బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు, 390 పరుగులకి ఆలౌట్ అయ్యింది.. తొలి ఇన్నింగ్స్ భారత జట్టు 518/5 పరుగులు చేయగా వెస్టిండీస్ 248 పరుగులకి ఆలౌట్ అయ్యింది. 270 పరుగులు వెనకబడిన వెస్టిండీస్, నాలుగో ఇన్నింగ్స్‌లో భారత్ ముందు 121 పరుగుల టార్గెట్ పెట్టింది.. వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ 40 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 2 వికెట్లు తీయగా కుల్దీప్ యాదవ్, జస్ప్రిత్ బుమ్రా మూడేసి వికెట్లు తీశాడు. 33 ఓవర్లు బౌలింగ్ చేసిన రవీంద్ర జడేజా ఒకే వికెట్ పడగొట్టాడు. వాషింగ్టన్ సుందర్‌కి ఓ వికెట్ దక్కాయి..భారత జట్టు ఈ ఏడాది టెస్టుల్లో 10 సెంచరీలు అప్పగించింది. గత ఏడాది కూడా భారత్‌పై ప్రత్యర్థి బ్యాటర్లు 10 సెంచరీలు చేశారు. అయితే విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో ఆడిన 8 ఏళ్లలో భారత జట్టు... ఏ ఏడాది కూడా టెస్టుల్లో 10, అంతకంటే ఎక్కవ సెంచరీలు ఇచ్చింది లేదు.. వెస్టిండీస్ జట్టు, నేపాల్ చేతుల్లో టీ20 సిరీస్ ఓడి, ఇండియాలో అడుగుపెట్టింది. అలాంటి టీమ్‌పైన 10వ వికెట్ తీసేందుకు జస్ప్రిత్ బుమ్రా, జడేజా, సిరాజ్ వంటి స్టార్లు, సీనియర్ బౌలర్లు ఉన్న టీమ్.. తెగ కష్టపడడం చూసి టీమిండియా ఫ్యాన్స్ షాక్ అయ్యారు. వెస్టిండీస్‌పైనే ఇలా ఉంటే, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి టీమ్స్‌తో మ్యాచుల సమయంలో పరిస్థితి ఏంటని? ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

## కొంపముంచిన గంభీర్ అనాలోచిత నిర్ణయం!



వెస్టిండీస్‌తో న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తప్పుడు నిర్ణయం తీసుకున్నాడా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ అయిన వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించడం సరైన నిర్ణయం కాదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.తొలి ఇన్నింగ్స్ తరహాలో రెండో ఇన్నింగ్స్‌లోనూ విండీస్‌ను ఆలౌట్ చేసి ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించాలని గంభీర్ రచించిన వ్యూహం బెడిసి కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తోంది. వెస్టిండీస్ ఓపెనర్ జాన్ కాంప్‌బెల్(199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 115) సూపర్ సెంచరీతో చెలరేగగా.. షైహోప్(189 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 92 బ్యాటింగ్) సెంచరీ దిశగా సాగుతున్నాడు.అయితే తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు 81.5 ఓవర్లు బౌలింగ్ చేశారు. ఇలాంటి సమయంలో విండీస్‌ను ఫాలో ఆన్ ఆడించడం ద్వారా భారత బౌలర్లు మళ్లీ బౌలింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో వారిపై అదనపు ఒత్తిడి నెలకొంది. వారు గాయాల బారిన పడే అవకాశం కూడా ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ ఒక్కడే 27 ఓవర్లు బౌలింగ్ చేయగా.. జడేజా 19 ఓవర్లు వేసాడు. ఫాలో ఆన్ ఆడించకుండా టీమిండియా బ్యాటింగ్ చేసుంటే భారత బౌలర్లకు తగిన విశ్రాంతి లభించేది. అప్పుడు మరింత హుషారుగా బౌలింగ్ చేసేవారు. కానీ గంభీర్ నిర్ణయం కారణంగా బౌలర్లతో పాటు బ్యాటర్లకు విశ్రాంతి లేకుండా పోయింది. రోజంతా ఫీల్డింగ్ చేసి బ్యాటర్లు బరిలోకి దిగాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఆఖరి రోజు పిచ్‌పై పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా స్పిన్నర్లకు అనుకూలంగా మారి బ్యాటింగ్ కష్టమయ్యే ఛాన్స్ ఉంది. అదే జరిగితే టీమిండియా 250ం రన్స్ టార్గెట్‌ను కూడా ఛేజ్ చేయడం కష్టంగా మారుతుంది. ఏది ఏమైనా గంభీర్ అనాలోచిత నిర్ణయం టీమిండియా కొంపముంచే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భారత్‌కు సెమీస్ ఛాన్స్‌లు ఉన్నాయా!




2025 మహిళల వరల్డ్‌కప్‌టోర్నమెంట్‌లో టీమ్ఇండియాకు వరుస షాక్‌లు తగిలాయి. విశాఖపట్టణం వేదికగా జరిగిన చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ హర్మన్‌సేనకు ఓటములు ఎదురుయ్యాయి. మొన్న సౌతాఫ్రికా మ్యాచ్‌లో ఓడగా, తాజాగా ఆస్ట్రేలియా చేతిలోనూ భారత్ పరాజయం పాలైంది. దీంతో టీమ్ఇండియా సెమీ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. టోర్నీలో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్, అందుకు తగ్గట్లే తొలి రెండు మ్యాచ్?ల్లో విజయం సాధించింది జోరు మీద కనిపించింది. తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై ఆధిపత్యం చలాయించిన భారత్ డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో నెగ్గింది. ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పైనా అదే ఆధిపత్యం ప్రదర్శించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పాక్‌పై టీమ్ఇండియా ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి 4 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో వంసగా రెండు విజయాలతో టీమ్ఇండియా హ్యాట్రిక్?పై కన్నేసింది. అదే జోరులో అచ్చొచ్చిన విశాఖపట్టణం వేదికగా సౌతాఫ్రికాను కూడా చిత్తు చేయాలని భావించింది. బ్యాటింగ్‌లో రిచా ఘోష్ (77 బంతుల్లో 94 పరుగులు) పోరాటంతో భారత్ 251 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ సాధించింది. సౌతాఫ్రికా ఛేజింగ్?లో 81 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. దీంతో భారత్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా అనుకున్నారంతా. కానీ ఆ తర్వాత సీన్ మారింది. ఆఖర్లో భారత్ పట్టుతప్పింది. నదినె డి క్లర్స్ (84లి), లారా వోల్వార్ట్ (70), చోలే ట్రైఆన్ (49) రాణించడంతో టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు. మహిళల క్రికెట్?లో బలమైన ప్రత్యర్థి అయిన ఆస్ట్రేలియాతో భారత్ ఆదివారం తలపడింది. ఈ మ్యాచ్‌లో భారత్ బ్యాటింగ్ చేసిన విధానం చూసి ఈసారి విజయం పక్కా అనుకున్నారంతా. ఓపెనర్లు మంధాన (80), ప్రతీక (75) రఫ్ఫాడించడంతో టీమ్ఇండియా 330 పరుగులు చేసింది. కానీ ఛేదనలో కెప్టెన్ అలీసా హీలీ (140) భారీ శతకంతో ఆసీస్?ను పోటీలో ఉంచింది. చివర్లో వికెట్లు టపటపా పడినా ఎల్లిస్ పెర్రి (47) క్రీజులో నిలబడి జట్టుకు విజయం అందించింది. దీంతో భారత్?కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా నాలుగు మ్యాచ్‌లు ఆడింది. అందులో రెండు విజయాలు, అన్నే ఓటములతో 4 పాయింట్లతో ఉంది. దీంతో ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ం0.682 నెట్‌రన్‌రేట్‌తో మూడో స్థానంలో కొనసాగుతోంది. 7 పాయింట్లతో ఆసీస్, 6 పాయింట్లతో ఇంగ్లాండ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. అయితే టోర్నీలో భారత్ ఇంకా మూడు మ్యాచ్?లు ఆడాల్సి ఉంది. గ్రూప్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో టాప్ నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్?కు చేరుకుంటాయి. ఈ లెక్కన ప్రస్తుతానికి భారత్?కు ఇంకా సెమీ ఫైనల్ ఛాన్స్?లు ఉన్నాయి. ప్రాక్టికల్?గా టీమ్ఇండియా రేస్?లోనే ఉంది. కానీ, సెమీస్ బెర్తు దక్కించుకోవడం మాత్రం అంత ఈజీగా ఏమీ కనిపించడం లేదు. టీమ్ఇండియా తమ తదుపరి మ్యాచ్‌లు ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్?తో ఆడాల్సి ఉంది. అయితే ఈ మూడింటిలో భారత్ కచ్చితంగా కనీసం రెండు మ్యాచ్?ల్లో నెగ్గాల్సి ఉంటుంది. అలా అయితేనే భారత్ సెమీ ఫైనల్ రేసులో సజీవంగా ఉంటుంది.

టీమ్ఇండియా తదుపరి మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గితే ఖాతాలో 10 పాయింట్లు ఉంటాయి. అప్పుడు ఇతర జట్ల ఫలితాలపై సంబంధం లేకుండా భారత్? సెమీస్?కు అర్హత సాధిస్తుంది ఒకవేళ భారత్ ఈ మూడింట్లో రెండు నెగ్గి, ఒకదాంట్లో ఓడితే అప్పుడు 8 పాయింట్లు ఉంటాయి. 8 పాయింట్లతో కూడా సెమీస్‌కు క్వాలిఫై అయ్యే అవకాశాలు ఉన్నాయి. కానీ అలా అవ్వాలంటే, భారత్? నెట్ రన్?రేట్ మాత్రం సౌతాఫ్రికా, న్యూజిలాండ్ కంటే ఎక్కువగా ఉండాలిఇక టీమ్ఇండియా రెండు మ్యాచ్?ల్లో ఓడితే అప్పుడు 6 పాయింట్లే ఉంటాయి. సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారుతాయి. అప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా న్యూజిలాండ్, సౌతాఫ్రికా జట్లు తదుపరి ఆడే మ్యాచ్‌ల ఫలితాలు కీలకం అవుతాయి

# ఒక్క ముద్దు సన్నివేశం లేదు

## తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్ధూ

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ 'తెలుసు కదా' రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకు ఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది? కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా? అని అడగ్గా కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాం అని సిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా? అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది. నా గత చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఒక సినిమా నన్ను కింద పడేస్తే.. మరొకటి టాప్‌లో చేర్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాలో పాత్ర 'టిల్లు' పాత్రను పోలి ఉందా? అని అంటే...దానికి, దీనికి సంబంధం ఉండదు. ఇందులో దానికి మించిన వినోదం ఉంటుందన్నారు. ఎప్పుడూ ఇద్దరు హీరోయిన్లతో మూవీ చేస్తున్నారని ఎందుకని అడిగితే...నేను ఇప్పటివరకూ ఇద్దరు హీరోయిన్లతో చేసింది ఒకే సినిమా 'కృష్ణ అండ్ హిజ్ లేడీ'. దానిలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. 'టిల్లు స్క్వేర్'లో అతిథి పాత్రలో మరో హీరోయిన్ ఉన్నారంతే. లవ్ స్టోరీ కాబట్టి దానికి తగినట్లే తెరకెక్కించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు లేవు. ఒక్క ముద్దు సీన్ కూడా ఉండకూడదు అని కథ చెప్పినప్పుడే నీరజకు కండీషన్ పెట్టా. ఇది ఫ్యామిలీ మూవీ. ఇద్దరు హీరోయిన్లు, దర్శకురాలు, నిర్మాత.. అందరూ మహిళలే.. వాళ్లందరితో వర్క్ చేయడం సరదాగా అనిపించింది. రాశీ ఖన్నా అయితే క్లైమాక్స్‌లో నేను చేయను అని 40 నిమిషాలు సెట్ నుంచి వెళ్లిపోయింది. 'నా బాయ్‌ఫ్రెండ్ ఇలా చేస్తే నేను అంగీకరించను' అని పక్కకి వెళ్లి కూర్చొంది. ఇది కేవలం పాత్ర అని చెప్పి తీసుకొచ్చాను. సెట్‌లో 16 మంది మహిళలు ఉండేవారు. వాళ్లందరిలో నేను ఒక్కడినే ఉండేవాడిని. ఇకపోతే సినిమా అన్నాక.. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి.. నాకు రికవరీ అనేది ఎమోషనల్‌గా కావాలి. ఫైనాన్షియల్‌గా కాదు. రవితేజతో గతంలో ఒక సినిమా ఎ÷-లాన్ చేశాం. కానీ, అది ఆగిపోయింది. ఒకవేళ మా ఇద్దరికీ సరిపోయే కథ ఉంటే కచ్చితంగా చేస్తాం అని సిద్ధూ అన్నారు.








# హిందీలో రీమేక్ కానున్న సంక్రాంతికి వస్తున్నాం

తెలుగు బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే 'భూల్ భులయ్యా 2', 'రౌడీ రాథోర్', 'లక్ష్మీ' వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస ఎలాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది. ఈ సమయంలో ఆయన మళ్లీ సౌత్ ఇండస్ట్రీ సూపర్ హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి కథను ఎంచుకుంటే సేఫ్ జోన్‌లో పడతాడని విశ్లేషకులు కూడా అంటున్నారు. బాలీవుడ్ ట్రేడ్ వర్గాల ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో నిర్మించేందుకు బాలీవుడ్ మేకర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం . వెంకటేష్ చేసిన పాత్రకు అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చాలా మంది భావిస్తున్నారు. తెలుగులో ఈ సినిమా విజయానికి కథ కంటే కూడా వెంకటేష్ టైమింగ్, కామెడీ టచ్, అనిల్ రావిపూడి మేకింగ్ ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే బాలీవుడ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటివి లేకపోతే , ఈ సినిమా డిజాస్టర్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్ల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# జై హనుమాన్‌పై రిషబ్ వ్యాఖ్యలు

## సినిమా ఆలస్యం కానుందన్న సంకేతాలు



'కాంతార చాప్టర్ 1'తో మళ్లీ ఒక్కసారి బాక్సాఫీస్‌ను శాసించిన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'జై హనుమాన్' గురించి చేసిన కామెంట్స్‌తో హాట్ టాపిక్ అయ్యాడు. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రిషబ్ చేసిన తాజా వ్యాఖ్యలతో ఫ్యాన్స్ కాస్త నిరాశలో ఉన్నారు. 'కాంతార చాప్టర్ 1' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రిషబ్ శెట్టి, తన తదుపరి ప్రాజెక్టుల గురించి స్పందించారు. 'చాప్టర్ 1 తర్వాత నేను చేస్తున్న సినిమా 'జై హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమా 2026 జనవరిలో సెట్స్‌పైకి వెళ్తుంది. ఆ తర్వాత నా డైరెక్షన్‌లో మరో సినిమా ఉంటుంది, అది రెండేళ్లలో వస్తుంది' అని ఆయన వెల్లడించారు. ఈ కామెంట్స్ విన్న తర్వాత అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇప్పటికీ షూటింగ్ ప్రారంభం కాలేదా? 2026 జనవరి అంటే సినిమా రిలీజ్‌కు ఇంకెన్నాళ్లు? అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'జై హనుమాన్' సినిమా నుంచి రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ అయినప్పుడు షూటింగ్ స్టార్ట్ అయిందన్న భావన అభిమానుల్లో ఏర్పడింది. కానీ ఆ ఫొటో కేవలం ఫోటోషూట్ మాత్రమేనని, అసలు షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందనే క్లారిటీ ఇప్పుడే వచ్చింది. 2026 జనవరిలో సెట్స్ పైకి వెళ్తే, పోస్ట్-ప్రొడక్షన్, గ్రాఫిక్స్, ప్రమోషన్స్ అన్నింటినీ కలుపుకుంటే ఈ సినిమా విడుదలకు కనీసం 2027 వరకు వేచి చూడాల్సి రావచ్చు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే గ్యాప్‌లో రిషబ్ శెట్టి దర్శకత్వం వహించే మరో ప్రాజెక్ట్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం, 'హనుమాన్' సినిమా సీక్వెల్ కావడంతో ఇప్పటికే భారీ బజ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించిన 'హనుమాన్' తర్వాత ప్రేక్షకులలో 'జై హనుమాన్'పై భారీ అంచనాలున్నాయి.

# బేబమ్మ కెరీర్ డిసైడ్ చేసే సినిమాలు..!

ఉప్పెన సినిమాతో టాలీవుడ్ లో తొలి సినిమాతోనే పాపులర్ అయ్యింది కృతి శెట్టి. ఆ సినిమా తర్వాత శ్యాం సింగ రాయ్, బంగార్రాజు సినిమాలు సక్సెస్ వచ్చినా ఆ తర్వాత మొదలైంది అసలు సినిమా. అప్పటి నుంచి లాస్ట్ ఇయర్ వచ్చిన మనమే వరకు కూడా కృతి శెట్టి సినిమా అంటే అది ఫ్లాపే అన్న విధంగా రిజల్ట్ ఉండేది. తెలుగులో స్టార్ డం వస్తే ఆ ఇంపాక్ట్ పాన్ ఇండియా లెవెల్ లో ఉంటుందని గుర్తించి ఇక్కడ అవకాశాల కోసం ఎదురుచూస్తుంది అమ్మడు. ఐతే ఈలోగా కోలీవుడ్ నుంచి ఆఫర్స్ రాగా అవి చేస్తూ వస్తుంది కృతి శెట్టి. తమిళ్ లో మొదట సైన్ చేసిన సినిమా జీనీ. రవి మోహన్ లీడ్ రోల్ లో వస్తున్న ఈ సినిమాలో కృతి శెట్టితో పాటు కళ్యాణి ప్రియదర్శన్ కూడా మరో హీరోయిన్ గా చేస్తుంది. ఈ సినిమాతో పాటు %వా.×.ఖ% అంటూ ప్రదీప్ రంగనాథన్ తో ఒక యూత్ ఫుల్ మూవీ చేస్తుంది అమ్మడు. విఘ్నేష్ శివన్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా తర్వాత కార్తితో వా వాతియార్ కూడా చేస్తుంది. ఐతే కృతి శెట్టి లక్కో ఏమో కానీ ఈ 3 సినిమాలు ఒకే మంత్ లో రాబోతున్నాయి. కార్తి వా వాతియార్ డిసెంబర్ 5 వస్తుంటే.. ప్రదీప్ తో చేసిన ఎల్.ఐ.కె డిసెంబర్ 18న రిలీజ్ అవుతుంది. ఈ రెండిటితో పాటు రవి మోహన్ జీనీ కూడా అటు ఇటుగా డిసెంబర్ లోనే రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. కోలీవుడ్ లో ఈ 3 సినిమాలతో తన టాలెంట్ చూపించబోతుంది అమ్మడు. కృతి శెట్టి కి ఈ 3 సినిమాలే చివరి అవకాశమని చెప్పొచ్చు. వీటిలో ఏది వర్క్ అవుట్ అయినా అమ్మడికి మరిన్ని అవకాశాలు వస్తాయి. ఒకవేళ తేడా వస్తే మాత్రం ఇక కెరీర్ చాలా రిస్క్ లో పడినట్టు అవుతుంది. ఉప్పెన సినిమా తర్వాత వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వచ్చింది కృతి. ఐతే అందులో కథాబలం ఉన్న సినిమాలు ఉన్నా ఎందుకో అమ్మడి బ్యాడ్ లక్ వల్ల వర్క్ అవుట్ కాలేదు. ఐతే తమిళ్ లో రాబోతున్న 3 సినిమాలు ఒకదానికి మించి మరొకటి అనేలా ఉన్నాయి. ఆ సినిమాల్లో ఏ సినిమా సక్సెస్ అయినా కృతికి మళ్లీ మంచి క్రేజ్ వస్తుంది. తెలుగులో అమ్మడికి మంచి ఫాలోయింగ్ ఉన్నా అది సినిమా సక్సెస్ చేయడానికి సరిపోవట్లేదని మేకర్స్ అమ్మడిని పక్కన పెట్టేశారు.

# ఆనంద్ దేవరకొండ..తక్షకుడు

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'తక్షకుడు'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**